# కొత్తపల్లి మల్లన్నకు బోనం



**పూడూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** పూడూరు మండలం పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో ఆదివారం శ్రీమల్లికార్జున స్వామి కళ్యాణం ఘనంగా జరిగింది. ఉదయం గ్రామం నుండి మల్లన్న దేవాలయం వరకు బోనాలతో బారులు తీరారు. ఈ సందర్భంగా బీర్లవారి డోలు చప్పుళ్లమధ్య పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతోభక్తులను ఆలపింపజేశారు. భక్తులు అడుగడుగున దండకాలు వేస్తూ, కొబ్బరికాయలు, గుమ్మడికాయలు కొడుతూ బోనాలకు స్వాగతం పలికి, స్వామివారికి నైవేద్యం సమర్పించారు. శ్రీ మల్లికార్జున స్వామివారి కల్యాణం సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన భక్తులు భారీసంఖ్యలో హాజరై తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ దీపికపాపిరెడ్డి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.




రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త


# ఏకలవ్య సేవలు

# భేష్

**తాండూరు, జనవరి 22, ప్రభాతవార్త :** దేశ అభివృద్ధే ప్రధాని నరేంద్రమోడీ లక్ష్యమని, వికసిత్ భారత్ దిశగా అడుగులు వేస్తున్నారని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజ్ శ్రీనివాస్ వర్మ అన్నారు. వికారాబాద్ జిల్లా తాండూరు మండల జిన్‌గుర్తి గ్రామంలో కొనసాగుతున్న ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సందీపని గురుకులం ఆవరణలో ఏర్పాటు చేసిన అదనపు భవనాల ప్రారంభోత్సవం కార్యక్రమానికి కేంద్ర మంత్రి భూపతిరాజ్ శ్రీనివాస్ వర్మ ముఖ్య అథితిగా హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం

**దేశానికి ఆదర్శనీయంగా ఫౌండేషన్ కార్యకలాపాలు**

**108 ఎకరాల స్థలంలో గరుకుల పాఠశాల ఏర్పాటు అభినందనీయం**

**మోడీ నాయకత్వంలో బలమైన శక్తిగా భారత్**

**కేంద్ర మంత్రి భూపతిరాజ్ శ్రీనివాస వర్మ**

ప్రసాద్‌కుమార్, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, రాజమండ్రి ఎంపి దగ్గుబాటి పురందేశ్వరీ, చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తదితరులతో కలిసి నూతన భవన ప్రారంభోత్సవం, అభివృద్ధి పనులకు శంకుస్థాపన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. ఏకలవ్య ఫౌండేషన్ సేవలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. సందీపనీ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు భవిష్యత్తులో ఎంతో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ ప్రాంతంతో సుమారు 108 ఎకరాల స్థలంలో సందీపని గరుకుల పాఠశాలతో పాటు దేశంలోనే తొలిసారి సేంద్రీయ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేస్తున్నారన్నారు. రైతులకు సేంద్రీయ వ్యవసాయంపై శిక్షణ, సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తులు ప్రోత్సహించడం అభినంద నీయమని కొనియాడారు. ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలకు కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ప్రధాని నరేంద్రమోడి నాయకత్వంలో దేశం ప్రపంచంలోనే బలమైన శక్తిగా ఎదుగుతోందని అన్నారు.



ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కేంద్ర మంత్రి భూపతిరాజ్ శ్రీనివాస వర్మ

**ఏకలవ్య ఫౌండేషన్‌కు సహకరిస్తాం: స్పీకర్**

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతలోని జిన్‌గుర్తి గ్రామంలో ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న సేవలు ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుందని అన్నారు. విద్యను వ్యాపారం చేయకూడదనే ఉద్దేశంతో కొనసాగుతున్న ఏకలవ్య ఫౌండేషన్‌కు ఎల్లప్పుడు తమవంతు సహకారం ఉంటుందని తెలిపారు. దీర్ఘకాలిక లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ ఫౌండేషన్ అతి తక్కువ సమయంలోనే భారత దేశంలో ఉన్న అన్ని ప్రాంతాల నుండి ప్రముఖులను ఒకే వేదికపైకి తెచ్చిందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా అందరికి విద్య అందించాలనే లక్ష్యంతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ పాఠశాలలను ప్రారంభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి, సీనియర్ నాయకులు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి సతీష్ చంద్ర, ఫౌండేషన్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





ఇంటర్‌కు ...

# 151 పరీక్షా కేంద్రాలు

**25 నుంచి మొదటి సంవత్సరం పరీక్షలు**
**- 26 నుంచి సెకండియర్‌కు షురూ- పకడ్బందీగా ఏర్పాట్లు**
**-గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని అధికారుల సూచన**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** ఈ నెల 25వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం అవుతున్నందున జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ నెల 25వ తేదీ నుంచి ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ప్రారంభం కానుండగా, 26వ తేదీ నుంచి ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా ప్రథమ సంవత్సరం విద్యార్థులు (జనరల్) 64,780మంది, వృత్తి విద్యా విద్యార్థులు 1,368మందికి మొత్తం 66,148మంది ప్రథమ సంవత్సరం పరీక్షలు రాయనున్నారు. ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులు 67,792మందికి, వృత్తివిద్యా విద్యార్థులు 1,258మంది ఉండగ మొత్తం విద్యార్థులు 69,050మంది పరీక్షలు రాయనున్నట్లు డిఐఇఓ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 151పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు, పరీక్షా కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల కన్వీనర్, డిఐఇఓ పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించనున్నారు. స్క్వాడ్స్, సిట్టింగ్ స్క్వాడ్స్, ఫ్లైయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేసినట్లు, పకడ్బందీగా ఏర్పాట్లు జరిగినట్లు తెలిపారు. పరీక్షా హాల్‌లో గోడగడియారంలు, సిసి కెమెరాలు వంటివి ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. విద్యార్థులు ఒక రోజు ముందుగానే హాల్‌టికెట్ పైన ఉన్న క్యూఆర్ కోడ్ సహాయంతో పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్షా కేంద్రాలకు గంట ముందే చేరుకుని ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండ అన్ని ఏర్పాట్లు ముందుగానే చేపట్టినట్లు వివరించారు.

# ఓటుకు నోటు విధానం పోవాలి

**మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు**

**షాద్‌నగర్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** రాజకీయాలకు డబ్బు జబ్బు పట్టుకుందని, ఈ ధోరణిలో మార్పు రాకపోతే సామాన్యుడు రాజకీయాల్లోకి రాలేని దుస్థితి ఏర్పడుతుందని షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల మున్సిపాలిటీ ఎన్నికలు మొదలుకొని అంతకు ముందు జరిగిన ఎన్నికలలో డబ్బులు విపరీతంగా ఖర్చుపెట్టి ఓట్లను కొనుగోలు చేస్తున్నారని అన్నారు. ఇలా చేయడం వల్ల ఓటర్లు కూడా ప్రలోభాలకు గురయ్యే ప్రమాదం ఉందని అన్నారు. ఓటు ప్రజలు బాధ్యతగా భావించాలని, కేవలం డబ్బుల కోసం ఓట్లు వేసే ధోరణి కి దూరం కావాలని అన్నారు. మరోవైపు రాజకీయాల్లో పదవుల కోసం ఉచితాలు ప్రవేశ పెడుతూ ప్రజలను బద్ధకస్తులను చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, వైద్యం మినహాయిస్తే దీనిని కూడా ప్రజలకు ఉచితంగా ఇవ్వడం సరికాదని ఇటీవల సుప్రీంకోర్టు కూడా చెప్పిన సంగతి ఆయన గుర్తు చేశారు. ఒకవైపు ప్రజలకు సేవకులుగా పనిచేసిన చేయాల్సిన ఉద్యోగులు జీతాలు తీసుకుంటూ కూడా అవినీతికి పాల్పడడం, మరోవైపు సేవ పేరుతో రాజకీయాల్లోకి వచ్చిన వారు కూడా అవినీతికి పాల్పడడం, ఎన్నికల్లో గెలుపు కోసం తమ అవినీతి సొమ్ముతో ఓటర్లను కూడా అవినీతి వైపు నడిపించడం దారుణం అన్నారు.

# 7వ తరగతి విద్యార్థి

# ఆత్మహత్యాయత్నం

**శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** హకీంపేట్ తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థి (12) ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన ఉదంతం కలకలం సృష్టించింది. ఆదివారం మధ్యాహ్నం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలంలోని హకీంపేట్ తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో ఈ సంఘటన చోటుచేసుకుంది. గమనించిన సిబ్బంది వెంటనే కొంపల్లి ప్రాంతంలోని వెల్‌నెస్ హాస్పిటల్‌కు తరలించారు. రాష్ట్ర క్రీడల, యూత్ శాఖల మంత్రి వాకిటి శ్రీహరి హుటాహుటిన హాస్పిటల్‌కు వెళ్లి విద్యార్థిని

**హకీంపేట్ తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో కలకలం**

**కొంపల్లి వెల్‌నెస్ హాస్పిటల్‌లో చికిత్స**

**హుటాహుటిన పరామర్శకు వచ్చిన మంత్రి వాకిటి శ్రీహరి**

**నిష్పక్షపాతంగా విచారణ చేయాలని ఆదేశం**

**వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని భరోసా**

పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. బాధిత విద్యార్థి ఆరోగ్యం మెరుగుపడే వరకు ప్రభుత్వమే వైద్య ఖర్చులు భరిస్తుందని మంత్రి వివరించారు. చికిత్స విషయంలో ఎలాంటి వెనకడుగు వేయవద్దని వైద్యులకు సూచించారు. విద్యార్థి ఆత్మహత్యాయత్నంకు దారితీసిన పరిస్థితులపై విచారణ చేయాలని పోలీసులను ఆదేశించారు. ఈ విషయానికి సంబంధించి డిజిపి శివదర్‌రెడ్డి తోనూ ఫోన్‌లో మంత్రి మాట్లాడారు. నిష్పక్షపాతంగా విచారణ చేయాలని సూచించారు. విద్యార్థి తల్లిదండ్రులకు మంత్రి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఎండి సోనీ బాలాదేవి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. విద్యార్థి ఆత్మహత్యాయత్నంకు సంబంధించి కారణాలు తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దీంతో ఈ విషయంపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులు, పోలీసులు సమగ్ర విచారణ చేస్తున్నారు.



ఆసుపత్రిలో పరామర్శిస్తున్న మంత్రి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ ఎండి సోని బాలాదేవి

# రోడ్డు ప్రమాదంలో

# లా విద్యార్థి మృతి

**మరో విద్యార్థికి గాయాలు**

**బైక్‌పై త్రిబుల్ డ్రైవింగ్‌తో ఆగి ఉన్న ట్రక్‌ను ఢీ**

**శామీర్‌పేటలో విషాదం**

**శామీర్‌పేట, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** శామీర్‌పేటలోని పెద్దమ్మ కాలనీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నల్సార్ లా యూనివర్సిటీ విద్యార్థి ఒకరు మృతిచెందగా, మరో విద్యార్థికి తీవ్రగాయాలు అయినట్లు పోలీసులు తెలిపారు. శామీర్‌పేట వైపున నుంచి నల్సార్ వైపునకు బైక్‌పై ముగ్గురు నల్సార్ విద్యార్థులు ప్రియాంశుకుమార్ మీనా(రైడర్), సాక్షమ్, గోపిచంద్‌లు బయలు దేరారు. శామీర్‌పేట పోలీసుల కథనం ప్రకారం శామీర్‌పేటలోని నల్సార్ లా యూనివర్సిటీ విద్యార్థులు ముగ్గురు బైక్‌పై శామీర్‌పేట నుంచి నల్సార్ వైపునకు బయలు దేరినట్లు, పెద్దమ్మ కాలనీ వద్ద రోడ్డుకు నిలిపి ఉన్న ట్రక్కును ఆ బైక్ ఢీకొనటంతో దానిపై వెళుతూ ఉన్న ముగ్గురు విద్యార్థులు రోడ్డున కిందపడి ఉన్నట్లు తెలిపారు. ఎలాంటి హెచ్చరికలు లేకుండా రోడ్డుపై ఆ ట్రక్కును పార్క్ చేయటం జరిగింది. దీంతో టాటా ట్రక్కును బైక్ డీకొని ముగ్గురు విద్యార్థులు రోడ్డున కింద పడిపోయినట్లు తెలిపారు. అయితే ఆ వెంటనే అదే రోడ్డులో అతివేగంగా అశోక్ లీలాండ్ ట్రక్ వాహనం అతివేగంగా వస్తూ రోడ్డుపై పడిపోయిన సాక్షమ్ విద్యార్థిపైకి ఎక్కటంతో తలకు తీవ్ర గాయాలు అయి ఆ వెంటనే అక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. విద్యార్థి ప్రియాంశుకుమార్‌మీనా భుజానికి తీవ్ర గాయాలు అయినట్లు వెంటనే చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తరలించినట్లు తెలిపారు. మరో విద్యార్థి గోపిచంద్‌కు ఎలాంటి గాయాలు కాలేదన్నారు. విద్యార్థులలో ఒకరు మృతిచెందగా, మరో విద్యార్థికి గాయాలు కాగ, మూడో విద్యార్థికి ఎలాంటి గాయాలు కాలేదని తెలిపారు. రోడ్డుకు ఎలాంటి సంకేతాలు లేకుండా నిర్లక్ష్యంగా నిలిపి ఉన్న ట్రక్కు డ్రైవర్ బాధ్యునిపై, అదే విధంగా అతివేగంగా నిర్లక్ష్యంగా అశోక్‌లీలాంగ్ ట్రక్కు మిగతా 2లో

# ఇల్లు లేదని నిరుత్సాహం వద్దు

**స్థలంతో పాటు రూ.5 లక్షలు ఇస్తాం**

**చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య భరోసా**

**చేవెళ్ల, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** ఇల్లు లేని నిరుపేదల కలను నెరవేర్చడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని చేవెళ్ల శాసనసభ్యులు కాలె యాదయ్య అన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని దేవుని ఎర్రవల్లి గ్రామంలో హరిజన శివయ్యకు తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయడంతో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లును ఆదివారం చేవెళ్ల మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. గ్రామీణా ప్రాంతాల్లోని ప్రతి పేద వాడి కలను నిజం చేయడానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు. ప్రతి నిరుపేద ఆడబిడ్డకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇవ్వాలనే లక్ష్యంతో పాటు పడుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేద కుటుంబానికి రూ.5 లక్షల రూపాయలతో ఇండ్లను నిర్మించుకోవడానికి అవకాశం కల్పించిందని అన్నారు. సొంత ఇల్లు ఉండాలని ప్రతి ఒక్కరూ కలలు కంటారని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం వారికి భరోసా కల్పిస్తూ ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయించి నిర్మించుకునేలా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వమే వారికి భరోసా కల్పించి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని రంగాల వారికి న్యాయం చేసే విధంగా ప్రభుత్వ పథకాలను అందజేస్తోందని తెలిపారు. ప్రతి ఒక్కరికి సొంత మిగతా 2లో



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలే యాదయ్య

# విద్యావ్యవస్థలో ఎఐ ఓ కొత్త అధ్యాయం

**అంతర్జాతీయ సెమినార్లో శంషాబాద్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్ రెడ్డి పరిశోధన పత్రం సమర్పణ**

**షాద్‌నగర్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** సాంకేతికత అనేది ఉపాధ్యాయుడికి సమానం కాదు.. ఇంకా చెప్పాలంటే ఏ వ్యక్తికి సమానం కాదు.. అది ఒక సాంకేతిక సౌకర్యం మాత్రమే.. కానీ రాబోయే కాలంలో విద్యావ్యవస్థ మొత్తం దీనిపైనే ఆధారపడుతుంది కాబట్టి విద్యార్థులు ఈ దిశగా తమ పరిజ్ఞానాన్ని పెంచుకోవలసిన అవసరం ఉంది.. ఇదే అంశాన్ని తన వాణిగా వినిపిస్తూ అంతర్జాతీయ స్థాయిలో తన పరిశోధన పత్రాన్ని సమర్పించారు శంషాబాద్ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ సామ రవీందర్ రెడ్డి.



మాట్లాడుతున్న డాక్టర్ రవీందర్ రెడ్డి

విద్యలో సాంకేతిక ప్రభావాన్ని, దాని ప్రయోజనాలను సూచిస్తూ ఢిల్లీలోని అంతర్జాతీయ సెమినార్లో ఆ పత్రాన్ని సమర్పించారు. కేంద్ర కామర్స్ ఇండస్ట్రీ అండ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి జితిన్ ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమం ఆర్ ఎస్ ఎం కక్ష ఫౌండేషన్ యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ ద్వారా నిర్వహించబడింది. దేశ రాజధాని న్యూఢిల్లీలోని జనపద రోడ్ లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్లో రెండు రోజులపాటు ఈ అంతర్జాతీయ సెమినార్ జరుగుతుంది. అయితే డాక్టర్ సామ రవీందర్ రెడ్డి తన పరిశోధన పత్రాన్ని క్రిటికల్ ఎవల్యూషన్ ఆఫ్ ది టీచర్ రోల్ ఇన్ ది డిజిటల్ ఇన్ ఇండియా అనే పేరుతో ఈ సెమినార్లో ప్రజెంట్ చేశారు. తెలంగాణలో ఒక సామాజిక సమస్య పైన చేస్తున్న తన పరిశోధన అంశం పట్ల మంత్రి తనకు అభినందనలు తెలిపినట్లు ఆయన వివరించారు.



# పుంజుకున్న కాంగ్రెస్

**246 పంచాయతీలలో పట్టు బిగించిన అధికార పక్షం**

**మున్సిపాల్టీలలో ఆరింటికి.. ఐదు చోట్ల హవా**

**ప్రాభవం కోల్పోతున్న బిఆర్ఎస్**

**గులాబీ దండుకు పెరుగుతున్న సవాళ్లు**

**రంగారెడ్డి జిల్లాలో మారిన రాజకీయ ముఖ చిత్రం**

**రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** జిల్లా రాజకీయ ముఖ చిత్రం వేగంగా మారుతోంది. శేర్లింగంపల్లి, చేవెళ్ల, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, రాజేంద్రనగర్, ఎల్బీనగర్, షాద్‌నగర్, కల్వకుర్తి మొత్తం ఎనిమిది శాసనసభ నియోజకవర్గాలు ఉన్న జిల్లాలో ఇటీవల జరిగిన పరిణామాలు అధికార సమీకరణాల్లో కీలక మార్పును సూచిస్తున్నాయి. గత శాసనసభ ఎన్నికల్లో కల్వకుర్తి, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో మాత్రమే కాంగ్రెస్ విజయం సాధించింది. అయితే, ఎన్నికల అనంతరం రాజకీయంగా కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. చేవెళ్ల, శేర్లింగంపల్లి, రాజేంద్రనగర్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరడం జిల్లా రాజకీయాల్లో సంచలనంగా మారింది. దీని ప్రభావం గ్రామీణ, పట్టణ స్థాయిల్లో స్పష్టంగా కనిపించిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**గ్రామ పంచాయతీల్లో కాంగ్రెస్ ఆధిపత్యం...**

జిల్లాలో మొత్తం 526 గ్రామపంచాయతీలు ఉండగా కాంగ్రెస్ 246, బిఆర్ఎస్ 121, భారతీయ జనతా పార్టీ 47, స్వతంత్రులు 50 మంది ఉన్నారు. ఈ ఫలితాలు గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్ బలం వేగంగా పెరుగుతోందని సూచిస్తున్నాయి. ఒకప్పుడు బిఆర్ఎస్‌కు కంచుకోటగా భావించిన గ్రామస్థాయి రాజకీయాలు ఇప్పుడు కొత్త దిశలో సాగుతున్నట్టు స్పష్టమవుతోంది.

**మున్సిపాలిటీల్లోనూ అదే ధోరణి...**

ఇటీవల జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల్లో ఐదు మున్సి పాలిటీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. మరో మున్సిపాలిటీ ఫలితం ఇంకా పెండింగ్‌లో ఉంది. పట్టణ ప్రాంతాల్లోనూ కాంగ్రెస్ ప్రభావం విస్తరిస్తోందని ఈ ఫలితాలు చెబుతున్నాయి. కాంగ్రెస్‌కు 50 స్థానాలు రాగ, బిఆర్ఎస్ 47 బిజెపి 14 స్థానాలు గెలుచుకుంది.

**బిఆర్ఎస్‌కు పెరుగుతున్న సవాళ్లు...**

శాసనసభ, గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ మూడు స్థాయిల్లో వచ్చిన ఫలితాలను పరిశీలిస్తే, బిఆర్ఎస్ పార్టీ రోజురోజుకు క్షీణిస్తున్నట్టే కనిపి స్తోంది.. పార్టీ నుంచి నాయకుల వలసలు, ప్రజల్లో పెరుగుతున్న అసం తృప్తి, ప్రత్యర్థి పార్టీల సమన్వయ రాజకీయాలు బిఆర్ఎస్‌కు ప్రధాన సవాళ్లుగా మారాయి.

బిఆర్ఎస్ తిరిగి పుంజుకోవాలంటే స్థానిక స్థాయి నాయకత్వాన్ని బలోపేతం చేయడం ప్రజా సమస్యలపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించడం గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో నమ్మకం పునర్నిర్మించడం అవసరం. లేకపోతే, జిల్లాలో రాజకీయం పూర్తిగా మారే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

## కాలనీ అభివృద్ధికి కృషి చేస్తా

**ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** సుప్రభాత్ టౌన్‌షిప్ కాలనీ అభివృద్ధికి శయశక్తులా కృషి చేస్తానని నూతనంగా కాలనీ అధ్యక్షుడిగా ఎన్నికైన గొబ్బూరి మణ్యం అన్నారు. పోచారం డివిజన్ కొర్రెములలోని సుప్రభాత్ టౌన్‌షిప్ ఓనర్స్ వేల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యుల పదవి ప్రమాణ స్వీకారం ఆదివారం స్థానిక కమ్యూనిటీ హాలులో జరిగింది. కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన గొబ్బురి మణ్యంతో పాటు సభ్యులు కాలనీవాసుల సమక్షంలో పదవి ప్రమాణ కార్యక్రమం జరిగింది. అధ్యక్షుడిగా పదవీ ప్రమాణ స్వీకారం అనంతరం జరిగిన సమావేశంలో గొబ్బురి మణ్యం మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యలను త్వరిగతిన పరిష్కరించడంతో పాటు కాలనీ అభివృద్ధికి తగిన కార్యచరణా రూపొందించి అమలు చేస్తానని అన్నారు. కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడిగా జి.మణ్యంతో పాటు ఉపాధ్యక్షుడు జె. ఉమాపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి టి. హరినాథ్, సంయుక్త కార్యదర్శిగా ఎం. రాజనర్సు, కోశాధికారిగా ఎస్. లక్ష్మీ నారాయణలు ఎంపిక కాగా వారు చేత కాలనీ ముఖ్యనాయకుడి చేతుల మీదుగా పదవి ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల బీజేపీ అధ్యక్షుడు బస్వరాజ్ గౌడ్, నాయకులు ఎం. రవి, బాబు తదితరులు పాల్గొన్నారు.



ఆసోసియేషన్ అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేసిన మణ్యం



మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డితో సొసైటీ మాజీ డైరక్టర్ లక్ష్మారెడ్డి

## రైతులకు యాంత్రీకరణపై అవగాహన సదస్సు

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ స్టేడియంలో జరుగుతున్న రైతుబడి అగ్రిషో సీజన్-3లో ఘట్‌కేసర్‌కు చెందిన రైతులు పాల్గొన్నారు. రైతులకు ఆధునిక సాగు పద్దతులు, వాణిజ్య పంటల సాగు, ఆధునిక సాంకేతిక యంత్రాలపై అవగాహన కల్పించేందుకు రైతు బడి వ్యవస్థాపకులు జూలకంటి రాజేందర్‌రెడ్డి ప్రదర్శను ఏర్పాటు చేశారు. తెలుగురాష్ట్రాల నుంచి వందలాది రైతులు వ్యవసాయ యాంత్రిక ప్రదర్శనను వీక్షించేందుకు తరలిరగా ఆధునిక యంత్రాలు, పరికరాల పనితీరు స్వయంగా పరిశీలించి వాటి కొనుగోలుకు ఆసక్తి చూపారని, 300 వరకు ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో నూతన యంత్రాలపై రైతులకు నిపుణులు అవగాహన కల్పిస్తున్నారని వారు తెలిపారు. ఘట్‌కేసర్ డివిజన్ నుంచి రాష్ట్ర విత్తన ధృవీకరణ ఆథారిటీ మాజీ సభ్యులు-ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘం మాజీ డైరక్టర్ రేసు లక్ష్మారెడ్డి, రైతులు చిల్కూరి రామలింగారెడ్డి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. మాజీ వ్యవసాయ, సహకారశాఖల మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని కలిసి వ్యవసాయ విషయాలఎపై కొద్దిసేపు చర్చించినట్లు తెలిపారు. వరికి ప్రత్యామ్నాయంగా వాణిజ్య పంటల సాగు చేస్తే రైతులు లాభాలు ఉంటాయని, సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకొని సాగు చేయాలని నిరంజన్‌రెడ్డి అవగాహన కల్పించారని తెలిపారు. అగ్రిషోలో పండ్లు, కూరగాయలు, ఉద్యానవన తోటలు, పాడిపోషణ, కోళ్ల పెంపకం వంటి వ్యవసాయ అనుబంధ రంగాలలలో వస్తున్న నూతన మార్పులు, కొత్త యాంత్రీకరణ పరిజ్ఞానపై రైతులకు వివరించారని పేర్కొన్నారు.



అంబేద్కర్‌కు నివాళులు అర్పించి ప్రమాణం చేస్తున్న సురేశ్‌గౌడ్

## అంబేద్కర్ ఆదర్శంగా సమాజహితానికి పాటుపడాలి

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం ద్వారానే బడుగు, బలహీనవర్గాలకు రిజర్వేషన్లు వచ్చి పదవులు సిద్దించాయని ఎదులాబాద్ మాజీ వార్డుసభ్యులు బింగి సురేశ్‌గౌడ్ అన్నారు. ఘట్‌కేసర్‌లో ఆదివారం ప్రబుద్ధభారత్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లడానికి 254వ వారం నిత్యపూలమాళ కార్యక్రమం నిర్వహించారు. సురేశ్‌గౌడ్ విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాళ వేసి నివాళులు అర్పించారు. అంబేద్కర్ 60 దేశాల రాజ్యాంగాలను చదివి భారతదేశ వర్ణ వ్యవస్థని, కులవ్యవస్థను దృష్టిలో పెట్టుకొని దేశ స్థితిగతుల కారణంగా భారత రాజ్యాంగాన్ని రూపొందించారని కొనియాడారు. పిబీఐ మేడ్చల్ జిల్లా సమన్వయకర్త మీసాల అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సురేశ్‌గౌడ్ అంబేద్కర్ అందించిన సేవలను, పోరాటాలను తెలియజేస్తూ ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం బహుజన చక్రవర్తి చత్రపతి శివాజీ మహారాజ్ 396వ జయంతి సందర్భంగా ఫ్లెక్సీకి పూలదండ వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అరుణ్ కుమార్ ఈసందర్భంగా శివాజీ జీవితచరిత్రను వివరించారు. ఈకార్యక్రమంలో నాయకులు బండారు రాందాస్, కె.నర్సింగ్ రావు, సత్యం, రాము, మహేశ్, విజయ్, అనిల్‌కుమార్, విజయ్‌కుమార్, అంజయ్య, గణేశ్‌గౌడ్, శివకృష్ణ, లలితప్రసాద్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అరెస్ట్

**తార్నాక, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త :** బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామ చందర్‌రావును పోలీసులు అరెస్ట్ చేశారు. తార్నాకలో ఆయన నివాసం వద్ద నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్న ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారకుండా ముందస్తు చర్యగా అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆందోళన సందర్భంగా పార్టీ శ్రేణులు నినాదాలుచేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. భద్రతా కారణాల దృష్ట్యా రామచందర్ రావును సమీప పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై బిజెపి నేతలు తీవ్రంగా స్పందిస్తూ అరెస్టును ఖండించారు. ప్రజాస్వామ్య హక్కులను అణగదొక్కే చర్యగా అభివర్ణించారు. కామారెడ్డి జిల్లా బాన్సు వాడలో రెండు వర్గాల మధ్య ఇటీవల ఘర్షణ జరిగింది. ఈ ఘటన నేప థ్యంలో అక్కడికి వెళ్లేందుకు రామచందర్‌రావు యత్నించగా.. పోలీసులు గృహ నిర్భందం చేశారు. అయినా ఆయన బయల్దేరడంతో అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు నివాసం వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులు, బిజెపి కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. పలువురు బిజెపి కార్యకర్తలను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# సాంకేతికత నైపుణ్యం ఉంటేనే ప్లేస్‌మెంట్

**ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** ఇంజినీరింగ్ విద్యతో పాటు విద్యార్థులు స్కిల్స్, సాంకేతిక నైపుణ్యత నేర్చుకోవడానికి అందుబాటులో ఏర్పాటు చేసిన టెక్యూ స్కిల్ ట్రైనింగ్ ఇన్నోవేషన్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఐఏఎస్ అధికారి జయప్రకాశ్ నారాయణ్ అన్నారు. పోచారం డివిజన్ చౌదరిగూడ లో ఏర్పాటు చేసిన టెక్యూ స్కిల్ ట్రైనింగ్ ఇన్నోవేషన్ సెంటర్‌ను ఆదివారం ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఐఏఎస్ అధికారి రిబ్బన్ కత్తిరించి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఐఏఎస్ అధికారి మాట్లాడుతూ ఇంజినీరింగ్, ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు తమ సబ్జెక్టుల్లో సాంకేతికత నైపుణ్యతను పెంపొందించుకోవడానికి ట్రైనింగ్ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సెంటర్ ఎండీ. అంజన్ కుమార్ మాట్లాడుతూ ఇక్కడి ఇంజినీరింగ్ విద్యార్థులు తమ విద్య పూర్తి అయ్యేలోపుగా మంచి నైపుణ్యత సాధించడానికి భవిష్యత్తులో ప్లేస్‌మెంటు సాధించడానికి తమ ట్రైనింగ్ సెంటర్లు ఉపయోగపడుతుందని అన్నారు.

నగరంలోని అమీర్ పేట్ వంటి సుదూర ప్రాంతంలో ఉన్న కోచింగ్ సెంటర్ల కొరకు చూడకుండా ఇక్కడి ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల సౌకర్యాం ఏర్పాటు చేసిన తమ ట్రైనింగ్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

ఈ కార్యక్రమంలో నల్ల నర్సింహారెడ్డి గ్రూప్ ఆఫ్ ఇంజినీరింగ్ కాలేజ్ డీన్ డాక్టర్ టి. రవీందర్‌రెడ్డి, కల్లూరి మండల మాజీ జడ్పీటీసీ కట్ట అజయ్‌బాబు, సెంటర్ ఎండీ. అంజన్‌కుమార్, సెంటర్ కో ఆర్డినేటర్లు అఖిల్, అభి, ఉపేందర్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.



స్కిల్ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఐఏఎస్ అధికారి జయప్రకాశ్ నారాయణ్

## అన్ని వార్డులకూ సమన్యాయం చేస్తా

### మున్సిపల్ చైర్మన్ పత్యనాయక్

**ఆమనగల్లు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** ఆమనగల్లు మున్సి పాలిటిని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మున్సిపాలిటీ చైర్మన్ నేనావత్ పత్యనాయక్ అన్నారు. అందుకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ చేయూతతో పట్టణాభివృద్దికి ప్రణాళికలు రచించి దశల వారీగా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. చైర్మన్ పత్యనాయక్ తన సొంత నియోజకవర్గం 6వవార్డులో శుక్రవారం ఉదయం పర్యటించారు. వార్డు పరిధిలోని గండి ప్రాంతాన్ని ప్రత్యేకంగా సందర్శించి ప్రజలతో మాట్లాడారు. అక్కడ ఎదురవుతున్న ప్రధాన సమస్యలపై ఆరా తీసి వాటి పరిష్కారానికి చేపట్టవలసిన చర్యల గురించి చర్చించారు. కాగా చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన తరువాత తన నియోజకవర్గంలో పర్యటించిన చైర్మన్‌కు అక్కడి ప్రజలు ఘన స్వాగతం పలికారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వార్డుల అభివృద్ధికి సమ న్యాయం పాటిస్తూ ముందుకు సాగుతామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు గణేశ్ నా యక్, కాలనీవాసులు వడ్డె గణేశ్ ఉన్నారు.



వార్డులలో పర్యటిస్తున్న చైర్మన్



కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

## కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

**చేవెళ్ల, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** యువత ప్రభుత్వాలపై ఆధారపడకుండా స్వయం ఉపాధితో ఆర్థిక అభివృద్ధి సాధించాలని చేవెళ్ల మున్సిపల్ ఛైర్ పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి సూచించారు. ఆదివారం చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలో ఏర్పాటు చేసిన క్యూ సెట్ కంప్యూటర్ శిక్షణ అకాడమీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో డిజిటల్ యుగంలో కంప్యూటర్ వాడకం సర్వసాధారణం అయిపోయిందన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమని విద్యార్థులు, నిరుద్యోగులు కంప్యూటర్ శిక్షణ విధిగా తీసుకోవాలన్నారు. వేసవికాలంలో దాదాపు అన్ని పాఠశాలలు, కళాశాలలు హాలి డేస్ ప్రకటిస్తాయి. చేవెళ్ల పట్టణ కేంద్రంలో వ్యవసాయం మార్కెట్ ఎదురుగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో విద్యార్థులు, నిరుద్యోగ యువతీ, యువకులు నేర్చుకోవాలని తెలిపారు. విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని కంప్యూటర్ పరిజ్ఞానాన్ని స్కిల్స్ ను ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలని తెలిపారు. ఇన్స్టిట్యూట్ నిర్వాహకులు శ్రీధర్ మాట్లాడుతూ.. క్యూ సెట్ కంప్యూటర్ అకాడమీలో అతి తక్కువ ఫీజుతో ఎంఎస్ ఆఫీస్, డిసిఏ ,సి లాంగ్వేజ్, ఫోటో షాప్, టాలీ, డిటిపి వంటి డిజిటల్ మార్కెటింగ్ కోర్సులను కూడా అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ఈ సదవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులతో పాటు గ్రామీణ ప్రాంత విద్యార్థులు, యువతి, యువకులు కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణ సమయంలో సమయపాలన పాటిస్తూ కంప్యూటర్ శిక్షణకు సహకరించడం ద్వారా నాణ్యమైన కంప్యూటర్ స్కిల్స్ నేర్పించేందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ 15వ వార్డు కౌన్సిలర్ బండారు శైలజా ఆగి రెడ్డి, చేవెళ్ల పిఏసిఎస్ మాజీ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బండారు ఆగి రెడ్డి, ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ లు శ్రీనివాస్, శేషు కుమార్, ఆలూరు మాజీ ఉప సర్పంచ్ కసిరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**చేవెళ్ల, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** మండల పరిధిలోని గుండాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి 2003-2004 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఎంతోకాలం తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల రోజుల అనుభవాలను పరస్పరం పంచుకుంటూ ఆహ్లాదకర వాతావరణంలో కార్యక్రమం కొనసాగింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయసింహ రెడ్డి, ఆశీర్వాదం, శ్రీనివాస్ చారి, రాములు, రాంరెడ్డి, బాల్ రాజ్, హరికృష్ణ, ప్రమీళ పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులు విద్యార్థి దశలో ఉపాధ్యాయులు అందించిన మార్గదర్శకత్వం తమ జీవితంలో ఎంతో ఉపయోగపడిందని పేర్కొన్నారు.

## ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న ప్రభుత్వం

### కాంగ్రెస్ పాలనపై మండిపడిన ఎంపి విశ్వేశ్వర్‌రెడ్డి

**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త**

మహానగరానికి మణిహారంలా ఉన్న చెరువుల సుందరీకరణ పేరుతో కోట్లాది రూపాయలు వెచ్చిస్తు న్నామని చెబుతున్న కాంగ్రెస్‌ప్రభుత్వం చెరువులను కాలుష్యానికి వదలివేసి, ప్రజారోగ్యంతో చెలగాట మాడుతోందని చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. చందానగర్ డివిజన్ పరిధిలోని గంగారం పెద్ద చెరువు దోమలకు అవాసమై చుట్టుపక్కల ప్రజలు అనారోగ్య సమస్యలపై సతమతమవటంతో బీజేపీ రాష్ట్రనేత, చందానగర్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరే టర్ కసిరెడ్డి సింధూరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమానికి చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటె స్టెడ్ ఎమ్మెల్యే మారబోయిన రవికుమార్ యాదవ్ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ. గంగారం పెద్ద చెరువు అభివృద్ధి పనులు నిలిచిపోవడంతో చెరువు నీరు మురికినీటికి అవాసమై కలుషితమైందన్నారు. గుర్రపు డెక్క పేరుకుపోవడంతో దోమలకు కేంద్రం గా మారిందన్నారు. దాదాపు నాలుగు కిలోమీటర్ల పరిధిలో దోమలు విపరీతంగా పెరిగిపోయాయని, ముఖ్యంగా చందానగర్, అన్నపూర్ణ ఎన్‌క్లేవ్, శిల్ప ఎన్‌క్లేవ్, ఫ్రెండ్స్ కాలనీ, ఇక్రిశాట్‌కాలనీ, అర్జున్‌రెడ్డి కాలనీ, శుబోదయ కాలనీ, సురక్ష కాలనీ తదితర చోట్ల ప్రజలు దోమల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు.

## వైభవంగా వేణుగోపాలుడి కల్యాణం

**కడ్తాల్, ఫిబ్రవరి 22, ప్రభతవార్త :** కడ్తాల్ మండల పరిధిలోని చరికొండ గ్రామంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం శ్రీ రుక్మిణీ సత్య భామా సమేత వేణుగోపాలస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పొల్యూషన్ బోర్డు సభ్యులు ఠాగూర్ బాలాజీ సింగ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చక్రవర్తి శ్రీనివాసాచార్యులు, రామాచార్యులు, కృష్ణమాచార్యులు, గోపాలచార్యులు, తిరుమల చార్యులు, కిరణ్ చార్యులు, రంగ రాజన్ చార్యులు, సర్పంచ్ పాలకుర్ల మహేందర్ గౌడ్, ఉపసర్పంచ్ బల్వంత్ రెడ్డి, మాజీ సర్పంచ్ భారతమ్మ నరసింహ గౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు పాలకుర్ల రాములు గౌడ్, యాదమ్మ, కందికంటి బాలకృష్ణ గౌడ్, సుమన్, గ్రామపంచాయతీ సభ్యులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## రాజకీయాలు ఎన్నికలకే పరిమితం

**ఆమనగల్లు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని టిపిసిసి సభ్యుడు ఆయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రాజకీయాలు ఎన్నికలకే పరిమితం చేయాలనే కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నామని, బేషజాలాలకు పో కుండా అభివృద్ధే లక్ష్యంగా ప్రజల కోసం పని చేస్తామన్నారు. ఆమనగల్లు మార్కెట్ యార్డు కార్యాలయం ఆవరణలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆమనగల్లు మున్సిపాలిటి పాలన పూర్తిగా పట్టణాభివృద్ధిపైనే ఫోకస్ ఉంటుందన్నారు. కాంగ్రెస్ బిజెపి పొత్తు ఇరుపార్టీలు ప్రజల శ్రేయస్సు, అభివృద్ధి కాంక్షించి తీసుకున్నదని, మొదట్లో ప్రజలు దీనిపై భిన్నభిప్రాయాలు వ్యక్తం చేసిన ఇప్పుడు మాత్రం రెండు పార్టీల కలయికను స్వాగతిస్తున్నారన్నారు. జనరల్ స్థానంలో గిరిజన సామాజిక వర్గానికి పదవి కట్టబెట్టడాన్ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, కాంగ్రెస్ పార్టీని గొప్పతనాన్ని కీర్తిస్తున్నాయన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య మాట్లాడుతూ ఇటీవల ఎన్నికలలో ప్రజా తీర్పును స్వాగతిస్తు పార్టీ ఓటమికి పూర్తి బాధ్యత వహిస్తామని, లోపాలను సరిదిద్దుకుని పార్టీ బలోపేతానికి ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఎన్నికల ఫలితాలతో సంబంధం లేకుండా ఆమనగల్లు పట్టణా భివృద్ధికి కట్టుబడి ఉన్నారని తెలిపారు. సమా వేశంలో మున్సిపల్ చైర్మన్ నేనావత్ పత్య నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మముదిరాజ్, మండల పార్టీ అధ్యక్షుడు తెల్గమళ్ళ జగన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు వస్పుల మానయ్య, సీనియర్ నాయకులు హన్మనాయక్, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, గుర్రం కేశవులు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న టిపిసిసి సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్



గుంతలను చదును చేస్తున్న దృశ్యం

## కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తా

### షాద్‌నగర్ కౌన్సిలర్ డి.రాజునాయక్

**షాద్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** షాద్ నగర్ పట్టణంలోని ఆరో వార్డులో గల ఆయా కాలనీలలో రోడ్ల మనమత్తులను చేపట్టి అదేవిధంగా మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తానని ఆరో వార్డు పట్టణ కౌన్సిలర్ డి. రాజు నాయక్ స్పష్టం చేశారు. ఆదివారం టీచర్స్ కాలనీలో రోడ్డు సమస్య గురించి స్థానికులు వివరించక సదరు రోడ్డులో మట్టి పోసి జెసిబి వాహనంతో లెవెల్ చేయించారు. పనులు అయిపోయే వరకు అక్కడే దగ్గరుండి సమస్యను తీర్చారు. భవిష్యత్తులో కాలనీవాసులు ఎక్కడ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే వాటిని నెరవేర్చేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తానని రాజు నాయక్ తెలిపారు.

## ఒంటరి మహిళకు మార్ఫింగ్ ఫొటోలతో వేధింపులు

**జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** ఒకడు పెళ్లన్నాడు.. మరొకడు ప్రేమన్నాడు.. ఒకరు ఒంటరి మహిళను మోసగించి మార్ఫింగ్ ఫొటోలతో డబ్బులు కాజేయగా, మరొకరు ఇన్‌స్టాలో దగ్గరై డబ్బుల కోసం కత్తితో బెదిరించాడు. బంజారాహిల్స్ ఠాణాలో జరిగిన వేర్వేరు కేసుల వివరాల్లోకి వెళితే.. రాజేంద్రనగర్ ప్రాంతానికి చెందిన ఒంటరి మహిళ బొటిక్ నిర్వ హిస్తుంది.ఆమెకు 2019లో అతేషామ్ మహమ్మద్ పరిచయం అయ్యాడు. ఆమె సెల్‌ఫోన్ హ్యాక్‌చేసి మార్ఫింగ్ ఫొటోలను తయారుచేశాడు. వాటిని ఉపయోగించి ఆమెపై బంజారాహిల్స్‌లోని ఒక హోటల్‌లో లైంగిక దాడికి పాల్పడ్డాడు. బెదిరింపులకు పాల్పడి దాదాపు రూ. 7 లక్షల వరకు ఆమెను బెదిరించి, పెళ్లి పేరుతో మోసగించి తీసు కొన్నాడు. గతేడాది నవంబరులో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయినప్పటికీ అతని నుంచి ఆమెకు వేధింపులు తప్పలేదు. దీనికితోడు ఆమె కుమార్తెను చంపుతా నంటూ బెదిరించాడు. ఈ సంఘటనలో బాధితురాలు బంజారాహిల్స్ పోలీసు లకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంజారాహిల్స్ నందినగర్‌లో నివసించే ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్(20) ఇంట్లో కరెంటు పనిచేయడానికి హెల్పర్‌గా వచ్చిన వంశీకృష్ణ (24) యువతిని మాటల్లో పెట్టాడు. అనంతరం ఆమెకు ఇన్‌స్టా ద్వారా హాయ్ అంటూ సందేశాన్ని పంపాడు. యువతి సైతం స్పందించడంతో రెండేళ్లుగా ఇద్దరు సన్నిహితులుగా మారారు. ఈ క్రమంలోనే యువతి నుంచి ఇబ్బందుల పేరుతో డబ్బులు తీసుకొన్నాడు. దీనికితోడు తన వద్ద ఉన్న ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో అందరికి పంపుతానంటూ బెదిరించాడు. దీనికి తోడు శనివారం కత్తితో బెదిరించి ఆమె వద్ద డబ్బుల వసూలుకు పాల్ప డ్డాడు. దీంతో తాను పనిచేసే ప్రాంతంలో, ఇంటికి వచ్చి వేధిస్తున్నాడంటూ యువతి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## హిమాయత్‌సాగర్‌లో యువకుడి హత్య

### పెట్రోల్ పోసి తగులబెట్టిన అగంతకులు

**అత్తాపూర్, ఫిబ్రవరి 22,ప్రభాతవార్త:**

హిమాయత్ సాగర్ సమీపం లో ఒక యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న ఎసిపి శ్రీనివాస్, సీఐ ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఎసిపి శ్రీనివాస్ కథనం ప్రకారం...శనివారం రాత్రి రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో టోలిచౌకి ప్రాంతానికి చెందిన వ్యాపారి అమీర్ మిస్ అయి నట్లు తండ్రి ఫిర్యాదు చేశారని అయితే అతని ఫోన్ నెంబర్ ద్వారా ట్రేస్ చేయగా హిమాయత్‌నగర్ సమీపం లో నిర్మానుష్య ప్రాంతంలో ఉన్నట్లు చూపించింది. అక్కడికి వెళ్లి చూడగా బైక్ పార్క్ చేసి ఉందని అదే ప్రాంతంలో మిస్సింగ్ అయిన అమీర్ మృతదేహం లభ్యమైంది. అయితే గుర్తుపట్టకుండా ఉండేందుకు అతనిపై పెట్రోల్ పోసి తగలబెట్టే ప్రయత్నం ఆగంతకులు చేయడంతో డెడ్‌బాడీ కాలిపోయి పడి ఉందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మూడు బృందాలతో సిసి కెమెరాలు ఆధారంగా యువకుడిని హత్యచేశాక తగలబెట్టే ప్రయ త్నం చేశారా లేక సజీవ దహనం చేశారా అన్న కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## హిట్ అండ్ రన్ కేసు నమోదు

**జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** బంజారాహిల్స్‌లో హిట్ అండ్ రన్ కేసు నమోదైంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత పురానాహవేలికి చెందిన సయ్యద్ అబ్దుల్ మెహదీ(26) స్నేహితుడు మహమ్మద్ సగీర్ అహ్మద్ ఒమర్‌తోకలిసి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. జూబ్లీహిల్స్‌లోని కడక్ హౌజ్ సమీపంలో వేగంగా వచ్చిన ఒక కారు వారి పక్కనుంచి ఢీకొట్టి అక్కడి నుంచి వెళ్లి పోయింది.

## దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**కేశంపేట, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో కుల వివక్షతో నిరుపేద రజక కుటుంబంపై జరిగిన దాడిలో పసిపాప మరణించడం అమానుషమని బిజెపి సీనియర్ నాయకుడు కల్వకోలు తిరుపతి అన్నారు. రెండు నెలల పసి బిడ్డతో కలిసి రజక దంపతులు గణేశ్, మోనిక, తల్లి జాతరకు వెళ్లారని తెలిపారు. పాప ప్రాణాలు కోల్పోవడానికి కారకులను తక్షణం శిక్షించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రంగారెడ్డి జిల్లా బిసి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి జోలం వెంకటయ్య యాదవ్, జిల్లా కార్యదర్శి గుండ్రాతి లింగం గౌడ్, మాజీ సర్పంచులు చంద్రయ్య, ముదిరాజ్, రమేష్ డిమాండ్ చేశారు.

## సర్పంచ్ సొంత ఖర్చుతో ఆలయ నిర్మాణం

**తలకొండపల్లి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని వెంకట్రావుపేట గ్రామంలో రజక కులస్థుల కులదైవం అయిన మడెలయ్య, ఈదమ్మ ఆలయ నిర్మాణం కోసం గ్రామ సర్పంచ్ ఇమ్మడి మహేష్ భూమి పూజ చేశారు. ఇట్టి గుళ్ల నిర్మాణం కోసం అయ్యే ఖర్చు తానే అందిస్తానని ఈ సందర్భంగా సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కెంచ రమేష్, ఉప సర్పంచ్ పోలె ప్రశాంత్, వార్డ్ మెంబెర్లు తోట శ్రీను, గౌర్ల లింగం, గువ్వ శంకరయ్య, మొక్తల సంతోష రాజు తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న సర్పంచ్ మహేశ్



ముళ్ల చెట్లను తొలగిస్తున్న సర్పంచ్ పుష్పమ అంజన్ రెడ్డి

## ముళ్ళ చెట్లు తొలగింపు

**తలకొండపల్లి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామములో రోడ్లకు ఇరువైపున ఉన్న ముళ్ల కాంపచెట్లను సర్పంచ్ బుజూరి పుష్పమ్మ అంజనరెడ్డి ఆదివారం సొంత ఖర్చులతో తొలగించారు. వెంకటాపూర్ గ్రామ పంచాయతీ నుండి జగబోయినపల్లి గేటు వరకు, లక్ష్మీ నారాయణ స్వామి గుడి నుండి అంతారం శివారు వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలిగించి వా హనాల రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించారు. రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతలను కూడా మట్టితో పూడ్చించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కూడా పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**తలకొండపల్లి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని పెద్దూర్ తండాలో మృతి చెందిన ముదవత్ బాబు నాయక్ కుటుంబాన్ని ఉప్పల ట్రస్ట్ చైర్మన్ వెంకటేష్ ఆదివారం పరామర్శించారు. రూ.3 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవుని పడకల్ (పెద్దూర్) మాజీ ఎంపిటిసి మూడవత్ రఘు నాయక్, మాజీ సర్పంచ్ మూడవత్ కిషన్ నాయక్, మూడవత్ శంకర్ నాయక్, వార్డ్ సభ్యులు మూడవత్ కిషన్, బాషా పాల్గొన్నారు.



## నమ్మకాన్ని వమ్ము చేయం

**ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** పోచారం డివిజన్ చౌదరిగూడ వెంకట సాయినగర్ కాలనీ ఫేజ్ 1 వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ నూతన కమిటీని ఆదివారం ఎంపిక చేసినట్లు కాలనీవాసులు తెలిపారు. నూతన కార్యవర్గం అసోసియేషన్ అధ్యక్షుడిగా పార్థివ్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా జి. ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా మల్యా ఆజ్మీరా, కోశాధి కారిగా చరణ్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా విశ్వనాథ్, కమిటీ కార్యవర్గ సభ్యులుగా జనార్దన్, రవీందర్ రెడ్డి, శంకర్, సుధాకర్, సాగర్, పవన్, మహేశ్, సందీప్, శ్రీకాంత్, లింగాస్వామి, జగదీశ్వర్, కనకయ్య, హరి కృష్ణ, రాజరాం, సుబాశ్ తదితరులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎలక్షన్ కమిటీ సభ్యులుగా మురళి, వెంకటేశ్వర్లు, జగదీశ్వర్, శంకర్, సుధాకర్ వ్యవహరించినట్లు తెలిపారు. అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన పార్థివ్ రెడ్డి మాట్లాడుతూ కాలనీ సంక్షేమం కొరకు అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు. కాలనీవాసుల అభ్యున్నతి కొరకు నూతనంగా ఏర్పాటు చేసిన కమిటీ పనిచేస్తుందని అన్నారు. తమపై అపారమైన విశ్వాసంతో తమను కమిటీ అధ్యక్షుడిగా ఎంపిక చేసిన కాలనీవాసులకు కృతజ్ఞతలు తెలిపారు.



నూతన కార్యవర్గ సభ్యులు

## రోడ్డు ప్రమాదంలో లా విద్యార్థి మృతి

(మొదటి పేజీ తరువాయి)

వాహనంను నడిపిన డ్రైవర్, సంబంధిత యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని పోలీసులు తెలిపారు. ప్రజలు రహదారులపై వాహనాలు నిలిపేటపుడు తప్పని సరిగా హెచ్చరికలు సంకేతాలు ఏర్పాటు చేయాలని, వాహనాలను వేగం నియంత్రణతో నడపాలని రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని శామీర్‌పేట పోలీస్ ఇన్స్‌పెక్టర్ (డిఐ) రాజు వాహనదారులకు స్పష్టం చేశారు. శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఇల్లు లేదని నిరుత్సాహం వద్దు

(మొదటి పేజీ తరువాయి)

ఇల్లు ఓ భరోసా.. సొంత ఇల్లు ఉంటే అసంతృప్తి అనేదే ఉండదని గట్టి నమ్మకం అన్నారు. ఇల్లు లేని నిరుపేదలు ఎవరూ అధైర్య పడవద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకం కింద స్థలం ఉన్నవారికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం ప్రభుత్వమే అందిస్తుందని, ఇల్లు నిర్మించుకునేందుకు జాగా లేని నిరుపేదలకు ప్రభుత్వమే స్థలంతో పాటు రూ.5 లక్షల సహాయం ఆర్థిక సహాయం అందించి ఇల్లు నిర్మాణానికి చేయూత కల్పిస్తాం దని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బండారు ఆగి రెడ్డి, చేవెళ్ల మున్సిపల్ కౌన్సిలర్ లు దావల్ గారి గోపాల్ రెడ్డి, బండారు శైలజా ఆగిరెడ్డి, బక్కా రెడ్డి మాధవి యాదిరెడ్డి, చేవెళ్ల పిఏసిఎస్ మాజీ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యులు బక్క రెడ్డి రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మాసన్నగారి మాణిక్య రెడ్డి, నరేందర్ గౌడ్, కరికె మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన దంపతులకు ప్రభుత్వ చీఫ్ విప్ శుభాకాంక్షలు

**షాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** షాబాద్ సహకార సంఘం మాజీ చైర్మన్ చల్లా శేఖర్ రెడ్డి కుమారుడు రజత్ కుమార్ రెడ్డి, వైదేహిల వివాహ వేడుకల్లో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు కొలన్ ప్రభాకర్ రెడ్డి, చల్లా శ్రీరాం రెడ్డి, కృష్ణ గౌడ్, రామేశ్వర్ రెడ్డి, గోవర్దన్ రెడ్డి, సర్పంచ్ లు నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.





ట్రాక్టర్‌ను సీజ్ చేసిన అటవీశాఖ అధికారులు

## అక్రమ ఇసుక ట్రాక్టర్ సీజ్

**ధారూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** ధారూర్ అటవీ రేంజ్ పరిధిలో అక్రమంగా ఇసుక ు తరలిస్తున్న ఒక ట్రాక్టర్ ను అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. యాలాల మండలం రాస్నం సెక్షన్ పరిధిలోని సంగాయిపల్లి వద్ద అధికారులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ పట్టుబడింది. ప్రాథమిక విచారణలో ఈ ట్రాక్టర్ ధారూర్ మండలం డి.కె. తండా గ్రామానికి చెందిన పరుశురాం అనే వ్యక్తికి చెందినదిగా గుర్తించిన అధికారులు, దానిని స్వాధీనం చేసుకుని ధారూర్ అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా రేంజ్ అధికారి శ్యామ్ కుమార్ మాట్లాడుతూ, అటవీ ప్రాంతంలోని సహజ వనరుల ు అక్రమంగా తరలించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. ఈ తనిఖీల్లో సెక్షన్ ఆఫీసర్ కనకరాజుతో పాటు సిబ్బంది ఆఫ్రిద్, ఉమేర్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

### అనుమానస్పదంగా ఒరిస్సా కూలీ మృతి

**ధారూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** అనుమానస్పదంగా కూలీ మృతిచెందిన సంఘటన ధారూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఈసంఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన పంకజ్ గత ఏడాది కాలంగా ధారూరు మండల కేంద్రంలోని భవానీ దాబాలోటీ స్టాల్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత రెండు రోజులుగా పంకజ్ పనికి రాకపోవడంతో, ఆదివారం ఉదయం దాబా యజమాని పవన్ ఉంటున్న గదికి వెళ్లి విచారించారు.

అక్కడ ఉన్న తోటి కూలీల ను పంకజ్ ఎక్కడ అని అడగగా, అత ను ఇంకా నిద్రపోతున్నాడని వారు తెలిపారు. దీంతో పంకజ్ (40)వద్దకు వెళ్లి నిద్ర లేపేందుకు ప్రయత్నించగా, అత ను ఎంతకూ పలకలేదు. దీంతో వికారాబాద్ ఆసుపత్రి తరలించారు. అక్కడ ఉన్న డ్యూటీ డాక్టర్లు పరిశీలించగా పంకజ్ అప్పటికే మృతి చెందాడు అని డాక్టర్లు తెలిపారు. హోటల్ యజమాని వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ధారూర్ ఎస్ఐ సున్నం రాఘవేందర్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతికి గల కారణాలపై ఆరాతీశారు. అనంతరం యజమాని పవన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

**జిల్లెడు చౌదరిగూడ, ఫిబ్రవరి 22, (ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని గుర్రంపల్లి గ్రామంలో ఆదివారం విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన అయ్యబావి పాండుకు చెందిన ఎద్దు ఎప్పటిలాగె మేత మేసుకుంటూ వెళ్లి పక్కనే ఉన్న ట్రాన్స్ ఫార్మర్‌కు తగిలింది. దీంతో ఎద్దుకు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దువిలువ దాదాపు 50వేలు ఉంటుందని బాదితుడు తెలిపాడు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు.



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షాక్‌కు గురై మృతి చెందిన ఎద్దు

### నేటి నుంచి సర్పంచ్‌లకు శిక్షణ

**జిల్లెడు చౌదరిగూడ, ఫిబ్రవరి 22, (ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లకు సోమవారం నుంచి ఐదు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముచ్చింతల సర్దజయంతి కాంప్లెక్స్‌లో శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు. మండలంలోని 24గ్రామ పంచాయితీల సర్పంచ్‌లు తప్పనిసరిగా శిక్షణ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన పెర్కొన్నారు. ప్రతి ఒక్క సర్పంచ్ ముఖాన్ని అన్‌లైన్ ద్వారా ధృవీకరించనున్నట్లు ఆయన తెలిపారు. దీని ద్వారానే కేంద్ర ప్రభుత్వనిధులు మంజూరు అవుతాయని అన్నారు, అందువల్లన ప్రతి ఒక్క సర్పంచ్ తప్పనిసరిగా శిక్షణ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** విద్యుత్ డిసిడబ్ల్యు పనులు, కరెంట్ తీగల కింద చెట్లకొమ్మలు తొలగిస్తున్న కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గుతుందని ఘట్‌కేసర్ విద్యుత్ ఏఈ బి.యశ్వంత్‌కుమార్ తెలిపారు. 11 కెవి బాలాజీనగర్ ఫీడర్ పరిధిలోని బాలాజీనగర్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, 11 కెవి అవుషాపూర్ ఫీడర్ పరిధిలోని అవుషాపూర్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, 11 కెవి యంనంపేట్ ఫీడర్ పరిధిలోని యంనంపేట్, ఇస్మాయిల్‌ఖాన్‌గూడలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 3:30 గంటల వరకు, 11 కెవి డానో ఫీడర్ పరిధిలోని యంనంపేట్ పరిశ్రమలు, ఘణాపూర్ పరిశ్రమలు, ఫకీర్‌టెక్యాల్‌లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు, మాధారం ఫీడర్ ఎజిఎల్ పరిధిలోని మాదారంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు, రైతులు, కంపెనీల నిర్వహకులు గమనించి తమకు సహకరించాలని ఏఈ సూచించారు.

# ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం..ప్రారంభం

### లాల్‌గడిమలక్‌పేట్ గ్రామంలో లబ్దిదారులతో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం చేయించిన వైనం



లాల్‌గడిమలక్‌పేట్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి మాట్లాడుతున్న అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీషకృష్ణారెడ్డి,రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్కా ప్రభాకర్‌గౌడ్,పాల్గొన్న పలువురు కౌన్సిలర్లు, పార్టీ అధ్యక్షులు తుంకి రమేశ్, పలువురు నాయకుల దృశ్యం

**శామీర్‌పేట, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు హామీలు ఇచ్చిన విధంగా పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరుచేసి నిర్మాణాలుపూర్తి చేస్తున్నట్లు, నిర్మించుకున్న వాటికి గృహప్రవేశాలు చేయటం జరుగుతుందని అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీషకృష్ణారెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్కాప్రభాకర్‌గౌడ్‌లు తెలిపారు. ఆదివారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపాల్టీ పరిధిలోని లాల్‌గడిమలక్‌పేట్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవటంతో వారు ప్రారంభించి లబ్దిదారులు నవ్యరాజశేఖర్‌తో గృహప్రవేశం చేయించారు. ఈ సందర్భంగ వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవటానికి ప్రభుత్వం 5లక్షల రూపాయలు మంజూరు చేసి నిర్మిస్తుందన్నారు. దశలవారీగ లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంకు ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. అలియాబాద్ మున్సిపాల్టీ పరిధిలోని వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు పొందిన వారు త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని తమ పూర్తి సహకారం ఉంటుందని అన్నారు. ఆర్థికంగా వెనకబడిన నిరుపేదలకు ఇళ్లు లేని వారికి సిఎం రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించటానికి మంజూరు చేయటం జరిగిందన్నారు. సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతాయని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల కుటుంబ సభ్యుల్లో గృహప్రవేశంతో సంతోషం నిండిందని ఆనందతో ఉన్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ కంటం శిరీషకృష్ణారెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్కా ప్రభాకర్‌గౌడ్‌లు అన్నారు. దీనిలో పాల్గొన్న వారందరిని లబ్దిదారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, అలియాబాద్ మున్సిపాల్టీ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్, మున్సిపల్ కౌన్సిలర్లు నేమూరి స్వప్నరాంప్రసాద్, తలారి మౌనికబాబు, ముద్దం సుదాకర్‌రెడ్డి, సామల జశ్వంత్‌రెడ్డి, మేడ్చల్ ఎఎంసి డైరక్టర్ తుంకి బిక్షపతి, మేడ్చల్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తంటం రాము, కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్ల పాండు, చాట్లపల్లి నర్సింగ్‌రావు, చిలుగురి మల్లేశ్, భూమిరెడ్డి నవీన్‌రెడ్డి, తంటం యాదగిరి, కొమ్ము వినోద్, ఇనాయత్, కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

**..గ్రామాలను దత్తత తీసుకుని సేవా కార్యక్రమాలు చేపడుతా..రాష్ట్రకాంగ్రెస్ నాయకులు నక్కా ప్రభాకర్‌గౌడ్**

శామీర్‌పేట మండల పరిధిలోని (జిహెచ్‌ఎంసి పరిధిలో) ఉన్న గ్రామాలతో పాటు, అలియాబాద్ మున్సిపాల్టీ పరిదిలోని గ్రామాలను దత్తత తీసుకుని అభివృద్దితో పాటు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తానని అందరికి అందుబాటులో ఉంటూ ఆరోగ్యం పరంగా ఆపద ఉన్నా, సమస్యలు ఉన్నా పరిష్కరించటానికి తన వంతు సహకారం, సేవా కార్యక్రమాలు చేపడుతానని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్కా ప్రభాకర్‌గౌడ్ పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో పర్యటించిన ఆయన రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు పేదలకు అందే విధంగా చూస్తానని, అదే విధంగా అభివృద్దితో పాటు తన వంతు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు.

### పేదలకు సఒంతింటి సౌకర్యం కల్పించటానికే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు

**..రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్కా ప్రభాకర్‌గౌడ్**

**..జిహెచ్ఎంసి పరిధిలోని ఉప్పరిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం**

**..ఘనంగా జరిగిన గృహప్రవేశ కార్యక్రమం**

**..పాల్గొన్న జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి**

**శామీర్‌పేట, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** పేదల జీవితాల్లో వెలుగు నింపటానికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి నిర్మించి స్వతింటి కలను నెరవేరుస్తూ లబ్దిదారులను గృహప్రవేశాలు చేయించటం చారిత్రాత్మకమని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్కా ప్రభాకర్‌గౌడ్ అన్నారు. ఆదివారం శామీర్‌పేట మండలంలోని (జిహెచ్ఎంసి పరిధిలోని) ఉప్పరిపల్లి గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డితో కలిసి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్కా ప్రభాకర్‌గౌడ్ ప్రారంభించారు. ఉప్పరిపల్లిలో ఇద్దరు లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావటంతో నిర్మించుకున్న వాటిని వారు ప్రారంభించారు. లబ్దిదారులు పొలమొల్ల జ్యోతి, బొక్క సాలెమ్మలతో వారు ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్కా ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ ఇళ్లు లేని నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు వీటిలో ఇద్దరు లబ్దిదారులు నిర్మించుకుని గృహప్రవేశాలు చేసుకోవటం సంతోషంగ ఉందన్నారు. ఆర్థికంగా బలహీన వర్గాలకు గృహవసతి కల్పించటానికి సిఎం రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు ఇవ్వటం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం 5లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు విడతల వారీగ లబ్దిదారులకు ఆ రూపాయలు అందజేయటం జరుగుతుందన్నారు. పేదల జీవితాల్లో వెలుగు నింపటానికి ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను మిగతా లబ్దిదారులు కూడ త్వరగా నిర్మించుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గృహ ప్రవేశాల తరువాత ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినందుకు ఇంటి సౌకర్యం కల్పించినందుకు లబ్దిదారులు సంతోషం వ్యక్తం చేశారు. పాల్గొన్న వారిని లబ్దిదారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు జిల్లా ఆర్టీఏ బి.జైపాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఎస్.మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ కమిటీ సభ్యులు బి.నాగమణి, ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, ఆర్.శ్రీనివాస్‌యాదవ్, జి.బాబు, ఎ.భానుచందర్, బి.భూపాల్‌రెడ్డి, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



ఉప్పరిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభించి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్కా ప్రభాకర్‌గౌడ్, జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి,పాల్గొన్న నాయకులు లబ్దిదారుల దృశ్యం

# నేడు శామీర్‌పేటలో శ్రీమల్లిఖార్జునస్వామి జాతర



.శామీర్‌పేటలో మల్లన్న జాతరకు ఎమ్మెల్యే మల్లారెడ్డిని ఆహ్వానించిన బిఆర్ఎస్ నాయకులు ఎం.ఐలయ్యయాదవ్, దాసరి బాబు, వంగ వెంకట్‌రెడ్డి,తదితరుల దృశ్యం

**శామీర్‌పేట, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** శామీర్‌పేటలో శ్రీమల్లిఖార్జునస్వామి జాతర సోమవారం జరుగుతున్నందున యాదవసంఘం వారు అన్ని ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు జాతరను పురస్కరించుకుని శ్రీమల్లిఖార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12.45గంటలకు శ్రీస్వామి వారి కల్యాణం, 2గంటలకు అగ్నిగుండాలు, 4గంటలకు బోనాల ఊరేగింపు జాతర కార్యక్రమాలు జరుగనున్నాయి. దీంతో శామీర్‌పేట యాదవసంఘం వారు శ్రీమల్లిఖార్జునస్వామి జాతరను పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ జాతరకు మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డిని స్థానిక బిఆర్ఎస్ నాయకులు ఎం.ఐలయ్యయాదవ్, దాసరి బాబు, వంగ వెంకట్‌రెడ్డి, బి.వెంకటేశ పలువురు వెళ్లి ఆహ్వానించారు. వీరితో పాటు పలు పార్టీల నాయకులు, భక్తులు కూడ పాల్గొననున్నారు.

### మల్లన్న స్వామి ఆశీస్సులతో అందరికి మంచి జరగాలి

**ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి**

**నందిగామ, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** నందిగామ మండలం మామిడిపల్లి గ్రామంలో



మల్లన్న స్వామి వారి కళ్యాణ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లన్న స్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని భగవంతుని వేడుకున్నారు. మల్లన్న స్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని వేడుకున్నారు .ఈ కార్యక్రమంలో మామిడిపల్లి సర్పంచ్ హనుమంత్ రెడ్డి,మొదల్లగూడ సర్పంచ్ అరుణ రాజు,నాగులపల్లి సర్పంచ్ రాధికాఅశోక్ రెడ్డి,మాజీ పిఎస్ చైర్మన్ విట్టల్,మాజీ ఎంపీటీసీ కాట్న మాధవి రవీందర్,మాజీ సర్పంచ్ ఉమా ప్రవీణ్ రెడ్డి,ఉపసర్పంచ్ రాజు బీఆర్ఎస్ నాయకులు సత్యనారాయణ,వెంకటేశ్వర్ రెడ్డి,గోపాల్ రెడ్డి,శ్రీపాల్ రెడ్డి ప్రభు,అనితఅశోక్,శ్రీకాంత్,ఉషామహేష్ రెడ్డి,మమతకిరణ్ గౌడ్,

# వరి సాగుపై రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

**షాబాద్ మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర**

**షాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** వరి సాగు చేస్తున్న రైతులు సకాలంలో పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడి సాధించాలని షాబాద్ మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర సూచించారు. షాబాద్ మండల పరిధిలో ఆదివారం సాగులో ఉన్న యాసంగి వరి పంటలను పరిశీలించి పత్రిక ప్రకటన విడుదల చేశారు. యాసంగి వరి పైర్లు ప్రస్తుతం ఎక్కువ శాతం పిలక దశలో ఉన్నాయని, నాటిన 15 20 రోజులకు రెండవ దఫాగా ఎకరానికి వేసే 30 కిలోల యూరియాతో పాటు 100 గ్రాముల కార్బెండాజిమ్ 25 + మాంకోజెబ్ 50 మిశ్రమ శిలీంద్రనాశిని కూడా కలిపి బురద పొలంలో సమానంగా కల్లుకోవాలని తెలిపారు. ఇలా చేయడం వల్ల యాసంగిలో ఆశించే కాండం కుళ్లు నివారించవచ్చని, కొన్ని ప్రాంతాల్లో జింక్ లోపం వల్ల ఆకుల మీద త్రుప్పు రంగు మచ్చలు ఏర్పడి మొక్కలు ఎదుగుదల లోపిస్తాయని తెలిపారు. ముఖ్యంగా చౌడు భూముల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుందని, దీని నివారణకు జింక్ సల్ఫేట్ 2 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. యాసంగిలో కాండం తొలిచే పురుగు ఉధృతి ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున దీపపు ఎరలు, సోలార్ దీపాలు లేదా లింగాకర్షణ బుట్టలను అమర్చుకుని రెక్కల పురుగుల ఉధృతిని గమనించాలని, పిలక దశలో ఎకరానికి మూడు లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసి, వారానికి ప్రతి బుట్టలో 2530 పురుగులు లేదా అంతకుమించి పడితే తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. నారుమడిలో ఒకవేళ గుళిక వేయకపోతే, 2025 రోజుల వయసున్న పిలకదశలో ఉన్న వరి పైరులో ఎకరానికి కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు 10 కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు 8 కిలోలు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.4జి గుళికలు 4 కిలోలు 25 కిలోల ఇసుకతో కలిపి సమానంగా పైరుకు చల్లుకోవాలన్నారు. అగ్గితెగులు గమనించినట్లయితే నివారణకు ఐసోప్రోథయోలెన్ 1.5 మీ. లీ లేదా ట్రైసైక్లోజోల్ + మాంకోజెబ్ 2.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని, ఆకుమచ్చ దశలోనే ఈ తెగులను నివారించుకోవాలని లేకపోతే మెడవిరుపు ఆశించి అధిక నష్టం కలిగించే అవకాశం ఉందని తెలిపారు. ప్రధాన పొలంలో 1520 రోజులలోపు ఉన్న వరి పైరులో కలుపు నివారణకు ఎకరానికి సైహలోఫాప్ పి బ్యూటైల్ + పెనాక్సులామ్ 750800 మి.లీ లేదా మెట్ సల్ఫ్యూరాన్ మిథైల్ + క్లోరోమ్యూరాన్ ఇథైల్ 8 గ్రా. లేదా ఇథాక్సి సల్ఫ్యూరాన్ + ట్రయాఫామోన్ 90 గ్రా. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని, గడ్డి జాతి మరియు వెడల్పాకు కలుపు మొక్కల నివారణకు 1520 రోజులలోపు సైహలోఫాప్ పి బ్యూటైల్ ఎకరానికి 300 మి.లీ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. సకాలంలో పంటలకు సస్యరక్షణ చర్యలు చేపట్టితే అధిక దిగుబడులు సాధించవచ్చు అని తెలిపారు. రైతుల సందేహాలు, సూచనల కోసం వ్యవసాయ అధికారులను సంప్రదించాలని తెలిపారు.

### ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు

**కోట్‌పల్లి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త;** మానసిక పరిస్థితి బాగలేక ఒంటిపై పెట్రోల్ పోసుకోని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఇలా ఉన్నాయి. మోత్కుపల్లి గ్రామానికి చెందిన దుర్గంచెర్వు అశోక్, అనంతయ్య, రమేష్, రవిలు నాల్గురు అన్నదమ్ములు వారు హైదరాబాద్‌లోని నివాసం ఉంటున్నారు. ఇందులో ముగ్గురు అశోక్, అనంతయ్య, రమేష్‌లకు పెళ్ళిలు అయ్యాయి. రవి వయస్సు (30) అన్నలతో పాటు హైదరాబాద్‌లో ప్రైవేటు జాబ్ చేస్తు



జీవనం సాగిస్తున్నారు.

రవి కొన్ని రోజుల నుంచి మానసిక స్థితి బాగ లేకపోవడంతో మోత్కుపల్లి గ్రామానికి వచ్చి నివాసం ఉంటున్నాడు. శనివారం నాడు సాయంత్రం 5, గంటల ప్రాంతంలో గ్రామంలోని హనుమాన్ మందిరంలో పెట్రోల్ తెచ్చుకోని ఒంటిపై పెట్రోల్ పోసుకోని తగలబెట్టుకున్నాడు వెంటనే స్థానికులు గమనించి మంటలు ఆర్పి వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రవి అన్న అశోక్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శైలజ పేర్కొన్నారు.

### కొండాపూర్‌లో మహిళ అదృశ్యం

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** ఓమహిళ ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ డివిజన్ కొండాపూర్‌లో అద్దెకు ఉంటున్న కార్మికుడు ప్రకాష్ భార్య కవిత ఈనెల 20వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ప్రకాష్ ఉదయం 8 గంటలకు పనికి వెళ్లి తిరిగి సాయంత్రం 6 గంటలకు ఇంటికి వచ్చి చూడగా భార్య కవిత కనిపించక పోవ డంతో అంతటా వెతికినా ఆమె ఆచూకి లభించలేదు. దీంతో ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో తన భార్య కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. మధ్యప్రదేశ్ నుంచి బ్రతుకుదెరువు ఒక సంవత్సరం క్రితం భార్యాభర్తలు కొండాపూర్‌కు వచ్చి నివాసం ఉంటున్నారని తెలిపారు. ఈమేరకు మహిళ మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఘట్‌కేసర్ ఎస్ఐ బి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.



కవిత

చెరువులో పడి మహిళా మృతి

**షాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** చెరువులో పడి మహిళా మృతి చెందిన సంఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. షాబాద్ ఎస్సై సతీష్ తెలిపిన వివరాల మేరకు.. షాబాద్ మండల పరిధిలోని పోలారం గ్రామానికి చెందిన కుంటి లక్షి ్మ, రాములు కూతురు ఆశగారి మనిష(28)ను గత 12 సంవత్సరాల క్రితం తాళ్లపల్లి గ్రామానికి చెందిన ఆశగారి నరసింహులు ఇచ్చి వివాహం జరిపించారు. శనివారం సాయంత్రం కూరగాయలు అమ్మేందుకు నగరానికి వెళ్లిన భర్త నరసింహులు మనిషా ఫోన్ చేసి త్వరగా ఇంటికి రమ్మని చెప్పింది. రాత్రి 12 తర్వాత ఇంటికి వచ్చిన నర్సింహులకు భార్య మనిషా లేకపోవడంతో, అత్త లక్షి ్మ కి సమాచారం ఇచ్చి చుట్టుపక్కల వెతికిన ఫలితం లేదు. ఊరు సమీపంలోని నాగుల చెరువులో శవమై తేలింది. మృతురాలకు ఒక కుమారుడు. మృతురాలు తల్లి లక్షి ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### క్లీన్ అమృత్ కార్యక్రమం

**మేడ్చల్ పెద్ద చెరువు పరిసరాల్లో చెత్త తొలగింపు**

**మేడ్చల్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** మేడ్చల్ పెద్ద చెరువు వద్ద సంత్ నిరంకారి మిషన్ ఆధ్వర్యంలో ప్రాజెక్ అమృత్ క్లీన్ వాటర్, క్లీన్ మైండ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా చెరువు పరిసరాల్లో



మేడ్చల్ పెద్ద చెరువు వద్ద చెత్తను తొలగిస్తున్న సంత్ నిరంకారి సభ్యులు,

పేరుకుపోయిన చెత్తనుతొలగించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షురాలు శైలజా హరినాథ్, మాజీ కౌన్సిలర్ మణికంఠా గౌడ్, నాయకులు, సంత్ నిరంకారి మిషన్ సేవాదళ్ సభ్యులు, పట్టణ ప్రజలు పాల్గొని శుభ్రం చేశారు. స్వంత ఇంటిలోని చెత్తను, టాయిలెట్లను శుభ్రం చేయడానికి వెనుకంజ వేస్తున్న నేటి రోజుల్లో ప్రజా హితం కోరి చెరువు వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగించడం అభినందనీయమని పలువురు కొనియాడారు.

### ఏఐ సమ్మిట్‌ను అడ్డుకోవడం సరైందికాదు

**-బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.సదానంద్‌రెడ్డి**

**వికారాబాద్,ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** ఇటీవల దేశ రాజధానిలో జరిగిన ఎఐ సమ్మిట్‌ను యువజన కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అని, అంతర్జాతీయ ఎఐ సమిట్ వద్ద దేశ ప్రతిష్ట ను యూత్ కాంగ్రెస్ నాయకులు దిగజార్చారని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.సదానంద్ రెడ్డి మండిపడ్డారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఎఐ టెక్నాలజీ ప్రాధ్యానత ను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం, ఎఐ టెక్నాలజీలో విప్లవాత్మకంగా అభివృద్ధి చేయడానికి అధిక నిధులు కేటాయించిందన్నారు. ఢిల్లీలో జరిగిన ఎఐ సమ్మిట్ 100 దేశాలకు పైగా ప్రతినిధులు, ప్రధాన మంత్రులు, ఎఐ రంగానికి చెందిన నిపుణులు హాజరు అయ్యారని తెలిపారు. భారత దేశం రూపొందించిన ఎఐ విజయాల ు ఈ సమ్మిట్‌లో ప్రదర్శించారని చెప్పారు. ఎఐ టెక్నాలజీ ఫలితంగానే ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతుండగా అన్ని భాషలలో అ నువాదమైందని తెలిపారు. 2047 వరకు భారత దేశం అగ్రరాజ్యంగా ఎదగడానికి చేసే ప్రయత్నంలో భాగంగా ఎఐ టెక్నాలజీ, ఐటి రంగం, ఎయిర్ అండ్ స్పెస్ టెక్నాలజీ, మెడిసన్ టెక్నాలజీల ు కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ రంగాలలో భారత దేశాన్ని అగ్ర రాజ్యం చేయడానికిఇలాంటి సమ్మిట్ల ు నిర్వహిస్తున్న సంగతి మనందరికీ తెలుసని చెప్పారు. భారత దేశంతో ఇతర దేశాలు సఖ్యతగా ఉండాలన్న ఆలోచనకు వచ్చిన సమయంలో భారత మండపంలో జరిగిన ఎఐ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ నాయకులు చేసిన అర్ధ నగ్న ప్రదర్శన అంతర్జాతీయ స్థాయిలో కించపరిచే విధంగా ఉందన్నారు. భారత దేశాన్ని టెక్నాలజీ రంగంలోనే కాకుండా అట్టడుగు స్థాయి వ్యక్తుల మౌళిక వసతులైన ప్రతి పేద వానికి ఇల్లు, మరుగు దొడ్డి, ప్రతి ఇంటికి నల్ల ద్వారా నీరు, ప్రతి పేద వాడికి ఆరోగ్య భీమా కార్డులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. 70 ఏండ్లు దాటినా ప్రతి వ్యక్తికి ఉచిత వైద్యం, అసంఘటిత కార్మికుల పెన్షన్, ప్రతి ఒక్కరికి బ్యాంక్ ఖాతా ద్వారా అందరికి ఇ న్సూరెన్స్ పథకాలు అందుతున్నాయని అన్నారు. ప్రతి గ్రామంలో వీధి దీపాలు, రోడ్లు, పల్లె ప్రకృతి వనాలు తదితర అభివృద్ధి ప నుల ు మోడీ ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేస్తుందన్నారు. విబి జీ రామ్ జీ పథకం ద్వారా గ్రామీణ మౌళిక వసతుల కల్పనకు గ్రామ పంచాయతీకే అధికారం ఇచ్చినట్లు తెలిపారు. దేశ అభివృద్ధి తోపాటు సామాన్య ప్రజలకు మేలు జరిగేలా పని చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి రాజకీయ పార్టీలకు అతీతంగా మద్దతు తెలుపాలని ఆయన కోరారు.

### నిస్వార్థంగా సేవచేసే నాయకుడే

# నిజమైన నాయకుడు

**-- మాజీ హాకా చైర్మన్ పరియాద కృష్ణమూర్తి**

**పెద్దెముల్, జనవరి 22, ప్రభాతవార్త :** ప్రజలకు నిస్వార్థంగా సేవచేసే నాయకుడే నిజమైన నాయకుడని.. అందుకు ఉదాహరణ పెద్దెముల్ స్వర్గీయ చిట్టెపు ప్రకాష్‌రెడ్డి అని మాజీ హాకా చైర్మన్ పరియాద కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం పెద్దెముల్ మండల కేంద్రంలోని జెడ్పిహెచ్ఎస్ స్కూల్ ఆవరణలో మండలానికి చెందిన మాజీ జెడ్పిటీసీలను, మాజీ ఎంపీపీలను, తాజా మాజీ ప్రజా ప్రతినిధులను, ప్రస్తుత చిట్టెపు ప్రకాష్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన తనయుడు చిట్టెపు రాఘవేందర్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ హాకా చైర్మన్ పరియాద కృష్ణమూర్తి, మాజీ డిసిసిబి చైర్మన్ పి. లక్ష్మారెడ్డి, మాజీ డిఎల్‌డిఎ చైర్మన్ పి. నారాయణరెడ్డి, కోట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య తదితరులు మాట్లాడుతూ.. చిట్టెపు ప్రకాష్‌రెడ్డి 30ఏళ్లు రాజకీయంలోఉన్నా.. ఏనాడు కూడాఆయన పదవిని ఆశిం చలే దని అన్నారు. ప్రజా సేవే పరమార్థంగా భావించి అందరి వ పొందిన వ్యక్తి ప్రకాష్ రెడ్డి అని కొ నియాడారు. మండలంలో ప్రజాప్రతినిధులుగా ఎంపికై ప్రజలకు సేవ చేసిన మాజీ, తాజా ప్రజాప్రతినిధులకు చిట్టెపు రాఘవేందర్‌రెడ్డి ఘనంగా సన్మానాలు చేయడం, ఇలాంటి సన్మానాలు ఇప్పటి వరకు ఎక్కడా జరగలేదని, అందుకు నాంది పలికిన రాఘవేం దర్‌రెడ్డి అభినందనీయులని అన్నారు. తాజా, మాజీ ప్రజాప్రతి నిధులంతా ఒకే వేదికపైకి రావడం ప్రజాప్రతినిధుల సమ్మేళనంగా మిగిలిపోయే రోజుగా గుర్తింపు ఉండిపోతుందని పలువురు వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో ప్యాట నారాయణరెడ్డి, పెద్దెముల్ సర్పంచ్ డివై నర్సింలు, మాజీ సర్పంచ్ కిషన్‌రావు, మాజీ సొసైటీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



పరియాద కృష్ణమూర్తిని సన్మానిస్తున్న రాఘవేందర్‌రెడ్డి.



సన్మాన కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు.

## మహిళా శక్తికి ఘన సత్కారం

**- విజయవాడలో శ్రీ శక్తి పురస్కారం కార్యక్రమం**

**హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశ్వ సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో మహిళలకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నారు. వేదిక వ్యవస్థాపకురాలు కొల్లి రమాదేవి సారథ్యంలో మార్చి 1వ తేదీన విజయవాడలోని బాలోత్సవ భవన్, రాఘవయ్య పార్క్ వద్ద ఈ వేడుక జరగనుంది. వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన మహిళలకు శ్రీ శక్తి పురస్కారంతో పాటు పట్టాభిషేకం నిర్వహించనున్నారు. హుస్నాబాద్ నియోజక వర్గంలో సమాజ హితానికి అంకితభావంతో సేవలందిస్తున్న సామాజిక సేవకురాలు కర్ణకంటి మంజులరెడ్డి సేవలను గుర్తించి ఆమెను ప్రత్యేకంగా సత్కరించేందుకు నిర్వాహకులు తనను ఆహ్వానించారు. మహిళల సాధికారతకు ప్రతీకగా నిలిచే ఈ కార్యక్రమంలో మహిళలు, సాహితీ కళాభిమానులు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకను విజయవంతం చేయాలని విశ్వ సాహితీ కళా వేదిక ప్రతినిధులు పిలుపునిచ్చారు.

## కార్పొరేట్‌కు ధీటుగా గురుకులాలలో విద్య

**హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** కార్పొరేట్‌కు ధీటుగా బిసి గురుకులాలలో న్యాయమైన విద్యను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని బిసి గురుకుల పాఠశాల జిల్లా సమన్వయకర్త రాజేశం అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పోతారం ఎస్ మహాత్మజ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కామన్‌మెనూద్వారా మంచి పోషకాహారం అందిస్తున్నామని అన్నారు. ప్రభుత్వంకల్పించిన సదుపాయాలను విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. బాలికలు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. విద్యార్థులు మంచి స్థానంలో ఉండి ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. అనంతరం వచ్చిన ప్రముఖులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్షి ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ వీణాచందన, ఉపాధ్యాయురాలు, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

## క్రాంతి కుటుంబానికి ప్రశాంత్‌రెడ్డి పరామర్శ

**చేర్యాల, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** జనగామ మున్సిపల్ 10వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ నీరటి రజిని, యువజన కాంగ్రెస్ జనగామ జిల్లా అధ్యక్షులు బోనసి క్రాంతి మామ నీరటి లింగం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కుమారుడు, యువనాయకులు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి ఆదివారం మృతుడి స్వగ్రామమైన చేర్యాల మండలం కడవేర్గు గ్రామంలో మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే వారి కుటుంబాన్ని పరామర్శించారు. ప్రశాంత్‌రెడ్డి వెంట యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ బందిగ, పట్టణ అధ్యక్షులు దాసరి శ్రీకాంత్, మాజీ కౌన్సిలర్ పచ్చిమడ్ల సతీష్, సీనియర్ నాయకులు రాగుల శ్రీనివాస్ రెడ్డి, జనగామ నియోజకవర్గ సోషల్ మీడియా కో కన్వీనర్ తాటికొండ సదానందం, యువజన కాంగ్రెస్ నాయకులు అందెనాని బాబు, ఆరుట్ల వినీత్, భూమని బాలరాజు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల నడ్డివిరుస్తోంది

**బిఆర్ఎస్ ఆధ్వర్యంలో రాజీవ్ రహదారిపై ధర్నా, రాస్తారోకో**

**కొండపాక, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** యాసంగి రైతుబంధును వెంటనే విడుదల చేసి రైతులను ఆదుకోవాలని బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కుకునూరు పల్లి లో రాజీవ్ రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యులు దేవి రవీందర్, మం డల సర్పంచుల ఫోరం అధ్య క్షుడు ఆకుల భద్రప్ప మాట్లా డుతూ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్స రాలు గడుస్తున్నా ఐదు పంటలకు వేయాల్సినటువంటి రైతుబంధు రెండు పంటలకే వేసి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేతులు దులుపుకుందని విమర్శించారు. కరోనా కష్టకాలంలో సైతం రైతులకు రైతుబంధువేసి రైతు లను ఆదుకున్న ఘనత కెసి ఆర్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు రైతుల పక్షపాతిగా ఉంటామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల నడ్డివిరుస్తుందన్నారు. రైతుబంధు రాక అరకొర కరెంటుతో రైతులు ఎన్నో కష్టాలు పడుతున్నా పట్టించుకోకుండా సిఎం రేవంత్ రెడ్డి బడాకాంట్రాక్టర్లకు మాత్రం వేలకోట్ల రూపాయలు నిధులు విడుదల చేస్తూ రైతులకు రైతుబంధు వేయకపోవడం దుర్మార్గమైనచర్య అన్నారు. రైతులను ఏడిపించిన ఏప్రభుత్వం అయినా బాగుపడదన్నారు. ఇప్పటికైనా వెంటనే యాసంగి రైతుబంధును విడుదల చేసి రైతులకు నిరంతరాయం కరెంటును ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు బూడిద రమేష్ గౌడ్, బూరుగు మధు మోహన్, డబ్బేటా భాస్కర్, దమ్మకుపల్లి కర్ణాకర్, సున్నం సుదర్శన్, శిల్పా నర్సింలు, కనకవ్వ ఐలయ్య, మాజీ సర్పంచులు బచ్చుల మైపాల్, కిరణ్ కుమార్ చారి, కనుక రాజ్, మాజీ ఎంపిటిసి భూములు గౌడ్, కొంతం రాజు, నరసింహులు గౌడ్, రిప్పల స్వామి, గొడుగు కిషన్, నాగరాజు, చరణ్ ఆయాగ్రామాల బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## పద్మశాలి కౌన్సిలర్లకు సన్మానం

**సదాశివపేట, ఫిబ్రవరి 22, (ప్రభాతవార్త):** స్థాని క చేనేత సహకార సంఘం భవనం నందు నూతనంగా ఎన్నుకోబడిన పద్మశాలి కౌన్సిలర్లను సన్మానించడం జరిగింది. 26వ వార్డు అపర్ణ శివరాజు పాటిల్ లింగాయత్, ఒకటవ వార్డు న్యాలం అర్జున్ ఫణి కృష్ణ, నాగుల మానెమ్మ రాములు, వైద్యం ప్రియాంక పవన్ కుమార్, బిట్ల నికిత ప్రేమ్ కుమార్, మరియు పద్మశాలి పెద్దలను పద్మశాలి సేవా సమాజం అధ్యక్షుడు మేకల జనార్దన్ చేనేత సహకార సంఘం అధ్యక్షుడు చింతా ఆనంద్ కుమార్ మరియు పాతకేరి అధ్యక్షుడు చిల్వేరి రవి కార్యదర్శి కొంగరి ప్రభు, కోస్గి నర్సింలు. గొల్ల కేరి అధ్యక్షుడు గుజ్జరి ఆంజనేయులు కార్యదర్శి మధునాల నర్సింలుహెట్కురి పేట అధ్యక్షుడు అడ్డగట్ల మనోహర్ కార్యదర్శి ఎన్నం మల్లేశం, లోపలి కోట అధ్యక్షుడు మునిపల్లి రామకృష్ణ కార్యదర్శి విజయ్ కుమార్‌మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింత గోపాల్ గౌరవ అధ్యక్షులు అంబటి విశ్వనాథం చికుర్తి అంబయ్య గాజుల కృష్ణ భీమనపల్లి నర్సింలు చిలువరి మల్లేష్ సోమశంకర్ మధునాల నర్సింహులు మేనేజర్ చిలువరి వెంకటేశం గోనె శంకర్ కృష్ణ నాగుల విజయకుమార్ సగం రాములు, శ్రీనివాస్ కోట రవీందర్ విశ్రాంత ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు నిమ్మాయిల మల్లేశం చింతా జనార్ధన్ పద్మా మాణిక్యం వైద్యం శ్రీశైలం ప్రభాకర్ శ్రీనివాస్ మల్లేశం నర్సింలు, రుమాల కృష్ణ చింత ఆదర్శ కుమార్ నాగారం రాము పండాల జగన్నాథం చింతశేఖర్ నాగారం శివశంకర్‌తదితర సభ్యులు హాజరై ఘనంగా సన్మానించడం జరిగింది.

## వేద మంత్రాలతో సుల్తానాబాద్‌లో ఆధ్యాత్మికం

**-నేత్ర పర్వంగా విగ్రహ, శిఖర, ధ్వజస్థంభ ప్రతిష్టాపనలు**

**సిర్గాపూర్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** మండల పరిధిలోని సుల్తానాబాద్ గ్రామం ఆదివారం వేద బ్రాహ్మణుల వేద మంత్రాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో నంది విగ్రహ ప్రతిష్టాపన, హనుమంతుడి ఆలయానికి శిఖర, ధ్వజస్థంభ ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలు, హోమాలు, శాస్త్రోక్త క్రతువులు కనులపండువగా జరుపుకున్నారు. గ్రామంలోని నిర్వహించిన పూజా కార్యక్రమాలకు గ్రామస్థులతో పాటు గ్రామం నుంచి అత్తారింటికి వెళ్లిన ఆడపడుచులు తమ పిల్లా పాపలతో గ్రామానికి చేరుకోవడంతో గ్రామంలో సందడి నెలకొంది. పూజా కార్యక్రమాలకు పరిసర గ్రామాల నుంచి భక్తులు చేరుకుని ఆలయంలో ఆలయ అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

# వన మాతకు.. జనహారతి..

**-చిన్న జాతరను తలపించిన ఏడుపాయల...**

**వాహనాల నిలుపుదలతో రాకపోకలకు ఇబ్బందులు....**

**పాపన్నపేట, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** కోరికలు తీర్చే కొంగుబంగారుతల్లిగా వన దుర్గమ్మకు భక్తుల జనహారతి పట్టారు., ఆదివారంప్రభుత్వ సెలవు దినాలు రావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఏడుపాయల వనదుర్గ భవానీమాతను దర్శించుకునేందుకు విచ్చేయడంతో ఏడుపాయల క్షేత్రం భక్తులతో సందడిగా మారింది. వేకువ జామునసే వేద పండితులు వేదమంత్రాలమధ్య అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి పట్టు వస్త్రాలు, వివిధ రంగుల పువ్వులతో అమ్మవారుదగాలాడుతు ఆధ్యాత్మికత ఉట్టిపడేలా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులుమంజీరా నది మడుగులు, చెక్ డ్యాం, పాయలల్లో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్ లలో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది, ఆలయ ఈఓ వీరేశం క్యూలైన్ల పై చలువ పందిళ్ళు ఏర్పాటు చేయడంతో క్యూలైన్లలోనే భక్తులు సేద తీరారు. రాజగోపురం వద్ద నుండి ఆలయం వరకు భక్తులు నడక దారిలో మ్యాట్ లను ఏర్పాటు చేస్తే కాస్త ఉపశమనం కలుగేదని భక్తులు ఆరోపించారు. ఇట ఎండల తీవ్రత దృష్ట్యా ముందు జాగ్రత చర్యలు చేపట్టి సిమెంటు బాటలో మ్యాట్ లను ఏర్పాటు చేస్తే



దర్శనమిస్తున్న వనదుర్గమాత

అమ్మవారికి మొక్కుల రూపేణ చెల్లించే బోనాలను ఎత్తుకొని మండుటెండలో వచ్చే భక్తులకు ఉపశమనం కలుగుతుందని భక్తులు అంటు న్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వాహనాలలో వచ్చిన భక్తులకు ఇబ్బందులు తప్పలేదు కిలోమీటర్ మేర వాహనాలు నిలుపుదల చేయడంతో కాలినడకన ఆలయానికి రావాల్సి వచ్చింది. వాహనాల రద్దీతో పార్కింగ్ నిడుకుంది. పలు ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిగా మరి కొందరు అమ్మవారికి ఒడిబియ్యం, తలనీలాలు, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వేద పండితులు శంకర్ శర్మ, పార్థివ శర్మ, నాగరాజు శర్మ, మురళి శర్మ, రాజశేఖర్ శర్మ, లుపూజలుచేపట్టగా. ఏడుపాయలలో ఎలాంటి ఇబ్బందులు ఎదురవ్వకుండ పాపన్న పేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తమ సిబ్బందితో గట్టి పోలీసు బందోబస్తు చేపట్టారు.



## వనదుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయాధిపతి...

**పాపన్నపేట, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గ భవాని మాత ను హైకోర్ట్ న్యాయాధిషులు యం ఎస్ రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. వారు ఆదివారం ఏడుపాయల కు చేరుకోగా ఆలయ ఇఓ వీరేశం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు అనంతరం వారు వన దుర్గ భవాని మాత ను దర్శించుకుని ప్రత్యేక అర్చన పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ ఇఓ వీరేశం శాలువాతో సత్కరించి అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు.

## సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులకు ఘన సన్మానం

**గజ్వేల్, ఫిబ్రవరి 22 (ప్రభాతవార్త):** సిద్దిపేట జిల్లా, గజ్వేల్ నియోజకవర్గ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులుగా ఎన్నికైన కొన్యాల బాల్‌రెడ్డి, వెంకన్నగారి వెంకట్‌రెడ్డిలను గజ్వేల్ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి నివాసంలో రాష్ట్ర పంచాయతీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు భూమన్నయాదవ్ ఆధ్వర్యంలో టిపిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, స్థానిక కౌన్సిలర్లు గుంటుకు శ్రీనివాస్, నక్క రాములుగౌడ్, ఉపేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డిలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని సర్పంచ్‌ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందరికి అందేలా చూడాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిమ్మనగూడ సర్పంచ్ కరుణాకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుఖేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటిద్దాం-క్షేమంగా గమ్యస్థానాలకు చేరుద్దాం

**-ఆటో డ్రైవర్‌లకు అవగాహన కల్పించిన ఎస్ఐ సుజిత్ దోమ**

**న్యాల్‌కల్, ప్రభాతవార్త 22, ప్రభాతవార్త:** రోడ్డు నిబంధనలు పాటిస్తూ వాహనాలను తోలుతూ ప్రయాణికులకు సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన అవసరం ఆటో డ్రైవర్‌లపై ఉందని ఎస్ఐ దోమ సుజిత్ అన్నారు. ఆదివారం మండల పరిదిలోని గంగ్వార్ చౌరస్తాలో ఆటో డ్రైవర్‌లకు అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా ఆటో డ్రైవర్‌లకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. నిదానమే ప్రదానమన్న నిజాన్ని ప్రతి వాహన చోదకుడు గుర్తించుకుని అతివేగంగా వాహనాలను తోలకుండా నిదానంగా వాహనాలను తోలాలని సూచించారు. తమ కోసం ఇంట్లో కుటుంబ సభ్యులు ఎదురుచూస్తూ ఉంటారని తెలుసుకుని క్షమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు.

## బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త**

హుస్నాబాద్ మండల పరిధిలోని పందిల్ల గ్రామంకు చెందిన తాడూరి చంద్రయ్య ఇటీవల మృతి చెందగా విషయం తెలుసుకున్న 9వ వార్డు సభ్యులు పోలవేణి మహేష్ ఆదివారం రోజున వారి కుటుంబాన్ని పరామర్శించారు. శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తూ, ఈ కష్ట సమయంలో తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి బాధిత కుటుంబానికి 25 కిలోల బియ్యం అందజేశారు. ఇలాంటి విషమ పరిస్థితుల్లో పరస్పర సహకారం ఎంతో అవసరమని, గ్రామ ప్రజలు ఒకరికి ఒకరు తోడుగా నిలవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు స్థానికులు పాల్గొని తాడూరి చంద్రయ్య కుటుంబానికి సంతాపం తెలియజేశారు. పోలవేణి మహేష్ గారి సేవాభావాన్ని గ్రామస్తులు ప్రశంసిస్తూ, ఇటువంటి సహాయక చర్యలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు.

## సోషలిజం ద్వారానే సామాజిక న్యాయం

**కొండాపూర్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** అమెరికన్ సామ్రాజ్యవాదానికి మోకరిల్లి దేశ సార్వభౌమత్వాన్ని కార్పొరేట్ శక్తుల చేతుల్లో బంధించిన మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మరో స్వాతంత్ర్య పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్యం పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో "రెడ్ బుక్ డే" సందర్భంగా కొండాపూర్ మండల కేంద్రంలో "బరితెగించిన అమెరికన్ సామ్రాజ్యవాదం" అనే అంశంపై సామూహిక పుస్తక పఠనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అతిమేల మాణిక్యం గారు మాట్లాడుతూ..1848 ఫిబ్రవరి 21న ప్రపంచాన్ని మార్చాలనే మహత్తర సంకల్పంతో కారల్ మార్క్స్ ఫ్రెడిక్ ఎంగెల్స్ రచించిన కమ్యూనిస్టు ప్రణాళిక మానవాళికి ఒక శాస్త్రీయ దృక్పథాన్ని అందించిందని తెలిపారు. వారు మనకు కేవలం ఒక సిద్ధాంతాన్ని మాత్రమే కాకుండా, ఈ ప్రపంచాన్ని అర్థం చేసుకునే చూపును, మార్చే ధైర్యాన్ని కూడా అందించారని పేర్కొన్నారు. నేటి పరిస్థితుల్లో సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవుతూ, కార్పొరేట్ శక్తులు ప్రభుత్వాల కంటే బలంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యం మార్కెట్‌కు బానిసగా మారి, సామాన్యుల హక్కులు కాలరాస్తున్నాయని విమర్శించారు. "రెడ్ బుక్ డే" అనేది కేవలం ఒక రాజకీయ జ్ఞాపకం మాత్రమే కాదు.. అది మానవాళి శ్రేయస్సు కోసం ఆవిర్భవించిన ఒక శాస్త్రీయ భావజాలానికి చారిత్రక ప్రతీక అని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో అమెరికన్ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాల్లో కార్యకర్తలంతా ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కొండాపూర్ మండల కార్యదర్శి కె. రాజయ్య, నాయకులు సుధాకర్, వెంకయ్య, సంజీవులు, అంజయ్య, వాణి తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజులకు స్ఫూర్తిగా నిలుస్తున్న స్వామి లక్ష్మణ్‌లు

**చిన్నకోడూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** ముదిరాజ్‌లు అన్ని రంగాలలో విద్యా, ఉద్యోగం, గానం, రచయితలుగా రాజకీయ నాయకులుగా లక్ష్యాలకు అనుగుణంగా ప్రతిభవంతులు కావాలని ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, సర్పంచ్ ఇట్టబోయిన శ్రీనివాస్ ముదిరాజ్‌లు అన్నారు. చిన్నకోడూరు గ్రామానికి చెందిన ఇట్టబోయిన స్వామి ముదిరాజ్ గుజారి గుజారి అనే జానపద గీతానికి 5 మిలియన్ల వ్యూస్ రావడంతో రచయితగా గాయకునిగా అవార్డు రాగా ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న దయ్యాల లక్ష్మణ్ పోలీసు స్పోర్ట్స్ మీట్ బాడీ బిల్డర్ స్టేట్ సెకండ్ వచ్చి అవార్డు అందుకోవడంతో ఆదివారం ముదిరాజ్ నాయకులు శాలువాలతో ఘనంగా సత్కారించి జ్ఞాపికలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌లు సమాజంలోనే వెనుకబడి ఉన్నారని ఇప్పుడిప్పుడే విద్యావంతులుగా ఎదుగుతూ అనేక రంగాలలో ముందుకు వస్తున్నారని తెలిపారు. కుటుంబాలలో వెలుగులు నిండాలంటే విద్య ఎంతో ముఖ్యమని విద్యను నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ప్రతినిధులు మేడికాయల వెంకటేశం, దూలం ముత్యం, పెండెల బాలయ్య, యాట రాజేష్, పడిగే లింగం, రాగి నాగరాజు, తుమ్మల తిరుపతి, పుప్పల బాలేష్, రేగుల కిషన్ తదితరులు పాల్గొన్నారు.



స్వామి లక్ష్మణ్‌లను సన్మానిస్తున్న దృశ్యం

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**చిన్నకోడూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** మండల పరిధిలోని మదిర గాడిచెర్లపల్లి గ్రామానికి చెందిన గాడిచెర్లపల్లి గణేష్ భార్య అశ్విని ఇటీవల ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించడంతో విషయం తెలుసుకున్న బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు ఎదగని లహరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్ సూచనతో ఆదివారం బాధిత కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం బాధిత కుటుంబీకులకు రూ.6 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. బాధిత కుటుంబీకులు అధైర్యపడొద్దని కాంగ్రెస్ సర్కార్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు రామకృష్ణ తదితరులు ఉన్నారు.

## ఆడపడుచు వివాహానికి సర్పంచ్ ఆర్థిక సహాయం

**చౌటకూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చౌటకూరులో గ్రామ ఆడపడుచు వివాహానికి సర్పంచ్ పార్కల రాంరెడ్డి ఆదివారం సర్పంచ్ పార్కల రాంరెడ్డి 11వేల రూపాయల ఆర్థిక సహాయం (పంచాయితీ ఎన్నికల సందర్భంగా చేసిన హామీ మేరకు) అందచేశారు. గ్రామానికి చెందిన కొన్యాల రమేష్ కుమార్తె వివాహం ఆదివారం జోగిపేటలో నిర్వహించారు. వివాహ వేడుకలకు సర్పంచ్ పార్కల రాంరెడ్డి హాజరై 11వేల రూపాయలను అందచేసి నూతన వధువరులను ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కలాలి రామాగౌడ్, కాంగ్రెస్ గ్రామ కమిటి అధ్యక్షులు వర్కల రమేష్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, కొల్కూరరి మొగులయ్య, దమ్మీ కృష్ణ, చక్రపాణి, దప్పు అశోక్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామ సమైఖ్య భవనం నిర్మాణానికి పూజలు చేస్తున్న సర్పంచ్ నందికంటి రామచంద్రారెడ్డి

## సరాఫ్‌పల్లిలో గ్రామ సమైఖ్య భవన నిర్మాణానికి శ్రీకారం

**-భూమి పూజ చేసి పనులకు ప్రారంభించిన సర్పంచ్**

**చౌటకూరు, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** మండల పరిధిలోని సరాఫ్‌పల్లిలో 10 లక్షల రూపాయల జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం నిధులతో నిర్మించే గ్రామ సమైఖ్య భవన నిర్మాణానికి ఆదివారం గ్రామ సర్పంచ్ నందికంటి రామచంద్రారెడ్డి భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పదేళ్ల క్రితం గ్రామ పంచాయితీగా ఏర్పడిన గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ది చెందేలా మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారంతో అభివృద్ది పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ వివరించారు. గ్రామంలో పంచాయితీ భవనంతో పాటు పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటి అధ్యక్షులు శివరాజ్ గౌడ్, ఉప సర్పంచ్ కుమ్మరి లక్ష్మి నర్సిములు, నాయకులు మల్లారెడ్డి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ఎమ్మెల్యే ఇంటిపై దాడి

**-బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నౌబాద్ జగన్నాథ్**

**జహీరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** కామారెడ్డి బిజెపి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఇంటిపై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేయడం ప్రజాస్వామ్యంపై దాడి చేయడమే అని భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నౌబాద్ జగన్నాథ్ తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యే ఇంటిపై దాడి చేయడం అధికార కాంగ్రెస్ పార్టీ అహంకారానికి, దుర్మార్గపు రాజకీయాలకు నిదర్శనంగా నిలిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి విసిరిన సవాల్‌ను స్వీకరించే ధైర్యం లేని కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇంటిపై రౌడీ మూకలతో దాడులకు తెగబడటం రాజకీయ కక్ష సాధింపుకు అద్దం పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసన సభ ఎన్నికల్లో కామారెడ్డి నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో వెంకటరమణారెడ్డి మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, రేవంత్‌రెడ్డిలను ఓడించినందుకు కక్ష కట్టి దాడులు చేయించారని కాంగ్రెస్ తీరుపై ఆసహనం వ్యక్తం చేశారు. హింసా రాజకీయలకు కాంగ్రెస్ గుడ్‌బై చెప్పాలని డిమాండ్ చేశారు.

## గొంగలూరులో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

**కంది, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కందిలోని వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల ఫైనల్ ఇయర్‌లో విద్యార్థులు సంగారెడ్డి జిల్లాలోని పుల్‌కల్ మండల పరిధిలోని గొంగలూరులో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా ఆదివారం మద్యం, ధుమపానం, మాదకద్రవ్యాలకు నో చెబుతూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రైతులకు ఆధునిక వ్యవసాయ సంకేతికతలపై అవగాహన కల్పించడంతో పాటు డ్రోన్ ద్వార ఎరువులు, పురుగుమందుల పిచికారి విధానం గురించి వివరించారు. గ్రామంలో గ్రామ మహిళలు నిర్వహిస్తున్న సరోధ్య స్వయం సహాయక సంఘాన్ని విద్యార్థులు సందర్శించి మహిళా సాధికారతకు, గ్రామ అభివృద్దిలో మహిళల పాత్రను ప్రశంసించారు. గ్రామానికి చెందిన శివరాజ్ చేస్తున్న సేంద్రీయ వ్యవసాయం క్షేత్రాన్ని సందర్శించి, రసాయన రహిత సాగు పద్దతులు, సహజ ఎరువుల వినియోగం, పంట నిర్వహణ విధానాలపై రైతులతో చర్చించారు.

## శివాలయ గుడి నిర్మాణానికి నరేందర్ రెడ్డి విరాళం



**గుమ్మడిదల, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** జిన్నారం గ్రామ మున్సిపాలిటీ పరిధిలోని భక్తుల మనోభిలాష నెరవేరేలా నిర్మాణంలో ఉన్న శ్రీ శ్రీ శ్రీ జీవన జ్యోతిర్లింగ శివాలయానికి గుమ్మడిదల మున్సిపాలిటీ 13వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ మూడుచింతల నరేందర్ రెడ్డి శనివారం రోజున రూ.1,11,117/ విరాళంగా అందజేశారు.

శివభక్తితో, ఆధ్యాత్మిక చైతన్యంతో, లోకకల్యాణం సంకల్పంతో ఆలయ నిర్మాణానికి తన వంతు సేవను అంకితమిచ్చిన కౌన్సిలర్ నరేందర్ రెడ్డిని శివాలయ నిర్మాణ కమిటీ సభ్యులు, అర్చక స్వాములు, గ్రామ పెద్దలు భక్తిపూర్వకంగా ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, "శివసేవే జీవసేవ" అనే భావనతో ప్రజాసేవను కొనసాగిస్తున్న నాయకులు సమాజానికి నిజమైన ఆదర్శమని, ఈ విరాళం శివాలయ నిర్మాణానికి మాత్రమే కాదు, భక్తుల హృదయాలకు వెలుగులు నింపే దివ్య కార్యమని పేర్కొన్నారు. శ్రీ మహాదేవుని కృపతో త్వరలోనే ఆలయ నిర్మాణం పూర్తి కావాలని, జిన్నారం గ్రామం ఆధ్యాత్మిక కేంద్రమై విరాజిల్లాలని భక్తులు ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో శివాలయ నిర్మాణ కమిటీ సభ్యులు, అర్చక స్వాములు, గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జన్నారం వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, కౌన్సిలర్ జైపాల్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, బాలరాజ్, కవ్వం రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాజిరెడ్డి, శ్రీకాంత్, ఎం ఎన్ ఆర్ యువసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కానుకుంట గ్రామ పెద్దమ్మ తల్లి దేవస్థానం నిర్మాణానికి లక్ష రూపాయల విరాళం

**గుమ్మడిదల, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** కానుకుంట గ్రామంలోని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పెద్దమ్మ తల్లి దేవస్థానం నిర్మాణానికి గుమ్మడిదల మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి లక్ష (రూ.1,00,000) రూపాయల విరాళం అందజేసి తమ ఉదార హృదయాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "గ్రామ దేవతల ఆశీస్సులతోనే ప్రజలకు సేవ చేయగలుగుతున్నాం. ఆధ్యాత్మికతతో పాటు సామాజిక బాధ్యతను కూడా మరిచిపోకుండా ముందుకు సాగాలి" అని పేర్కొన్నారు. దేవస్థానం నిర్మాణానికి తమ వంతు సహకారం అందించడం గర్వంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభాకర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష ్యంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న ప్రభాకర్ రెడ్డి సేవాభావానికి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధి, ఆధ్యాత్మిక వికాసం కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకుడిగా ప్రభాకర్ రెడ్డి మరోసారి ప్రజల మన్ననలు పొందారు.

# రామాయంపేటలో పర్యటించిన జిల్లా ఉప వైద్యాధికారి...

**హాస్టల్ సందర్శన...అస్వస్థకు గురైన విద్యార్థులకు పరీక్షలు...**

**రామాయంపేట, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** మెదక్ జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్. అనిల ఆదివారం నాడు రామాయంపేటలో పర్యటించారు. పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను సందరిశంచి, శనివారం నాడు జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో రాగిజావ సేవించి అస్వస్థకు గురైన విద్యార్థులకు ఆమె ప్రత్యేక పరీక్షలు చేసి, చికిత్స చేశారు. అంతేకాకుండా హాస్టల్‌లో ఉన్న పలువురు విద్యార్థులకు కూడా పరీక్షలు చేశారు. అనంతరం అస్వస్థతకు గురైన ఆరుగురి విద్యార్థుల ఆరోగ్యం క్షేమంగానే ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్బంగా ఆమె హాస్టల్ పరిసరాలను, వంటగదిని, విద్యార్థుల త్రాగునీరును, చేసిన వంటకాలను పరిశీలించారు. విద్యార్థులకు ఖచ్చితంగా ఆర్ఓ వాటర్‌ను ఏర్పాటుచేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో రామాయంపేట తహశీల్దార్ రజనికుమారి, ఎంపిహెచ్ఓ రమేష్, ధర్మారం పిహెచ్‌సి సిహెచ్ఓ కొండయ్య, ఎంపిహెచ్ఓ రామారావు, ఎఎన్ఎం రమాదేవి, ఆశవర్కర్ పద్మతో పాటు పలువురు ఉన్నారు.



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ అనిల

## గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్‌కు ఘన సన్మానం

**గుమ్మడిదల, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ ను పలువురు గ్రామాల ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. ప్రజల సంక్షేమమే లక్ష ్యంగా అహర్నిశలు కృషి చేస్తూ, మున్సిపాలిటీ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షి ంచారు.



మున్సిపల్ చైర్మన్ సన్మానిస్తున్న పలువురు నాయకులు

ఈ సందర్భంగా ఎలాపూర్, సర్పంచ్ సునీత రాముల నాయక్, అశోక్ గౌడ్, ఉప సర్పంచ్ నర్సా గౌడ్, భీమ్లా నాయక్ తది తరులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరిస్తూ, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయాలని చైర్మన్ కుమార్ గౌడ్ నాయకత్వం పట్ల తమ పూర్తి విశ్వాసం ఉందని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజలు ఇచ్చిన ఆదరణ తనకు మరింత బాధ్యతను పెంచిందని, గుమ్మడిదల మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలిపేందుకు కట్టుబడి పనిచేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల సహకారం, నాయకుల సూచనలతో గుమ్మడిదలను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాజిరెడ్డి, నాయకులు పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, ఆకుల సత్యనారాయణ, ప్రవీణ్ రెడ్డి, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

## నేడే గుమ్మడిదల మున్సిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్ పాలక వర్గం బాధ్యతలు

**సోమవారం పట్టణ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష**




**గుమ్మడిదల ఫిబ్రవరి 22 ప్రభాతవార్త**

గుమ్మడిదల మున్సిపాలిటీలో సోమవారం చైర్మన్, వైస్ చైర్మన్ ఆధ్వర్యంలో పాలక వర్గం బాధ్యతలు స్వీకరించనున్నారు. చైర్మన్ చిన్న పాపని కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్య గోవర్ధన్ రెడ్డి, పాలకవర్గం తమ సీట్లలో నేడు కొలువు తీరనున్నారు. ఈ సందర్భంగా పట్టణ అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, డ్రైనేజీ, రహదారుల అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించనున్నారు. మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు చర్యలు తీసుకోవాలని పాలక వర్గం నిర్ణయించింది. ముఖ్యంగా పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి, చెత్త సేకరణ, కాలువల శుభ్రపరిచే పనులు క్రమబద్ధంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే పన్నుల వసూళ్లు, ప్రభుత్వ పథకాల అమలు, పట్టణ సుందరీకరణ కార్యక్రమాలపై కూడా చర్చించనున్నారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా మున్సిపాలిటీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించనున్నారు. త్వరలో గుమ్మడిదల లో ఉన్న ఎర్ర చెరువు సుందరీకరణకు తగిన ఏర్పాట్లు చేస్తారని సమాచారం ఈ సమావేశానికి మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, వివిధ విభాగాల అధికారులు హాజరుకానున్నారు.